అక్టోబరు 2023

# చైతన్యం

సంకల్ప బలం

రు.20/- సామాజిక విలువల మాసపత్రిక



ప్రత్యేక
పుష్కర
సంచిక

దసరా
శుభాకాంక్షలు

## 12 వసంతాలు పూర్తి చేసుకున్న మన పత్రిక


Katalin Karikó
Drew Weissman
నోబెల్ బహుమతి వైద్య శాస్త్రం 2023 విజేతలు


నోబెల్ బహుమతి రసాయన శాస్త్రం 2023 విజేతలు




# చైతన్యం

సంకల్ప బలం

సామాజిక విలువల మాస పత్రిక

అక్టోబరు 2023

సంపుటి -13 సంచిక - 1



వ్యవస్థాపక సంపాదకురాలు

**తీగవరపు శాంతి**


## ఈ సంచికలో....


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| బతుకమ్మ పండుగ విశిష్టత | 7 |
| వార్తా విశేషాలు | 8 |
| శుభాకాంక్షలు | 9 |
| ఆత్మీయ శుభాకాంక్షలు | 10 |
| ముదితల్ నేర్వగరాని..... | 11 |
| ద్రౌపది | 12 |
| ఆంధ్రుల అభిమాన అత్తగారు సూర్యకాంతం | 16 |
| ఇకనైనా మారాలి | 20 |
| కలలన్నీ కల్లలేనా | 21 |
| బ్రహ్మ ఖండం | 22 |
| సంభాషణ సంస్కృతం | 25 |
| శ్మశ్రుకేశులు ఆకా గడ్డంబాచోళ్ళు | 26 |
| కృష్ణ లీలావిలాసం | 30 |
| ఈ విశ్వం యొక్క ఉనికికి కారణం ఏమిటి? | 36 |
| అశ్వత్థం నీలకంఠం | 39 |
| చలించని దళిత మహిళా హుంకృతి ముద్ర-శ్రీమతిజూపాక సుభద్ర | 41 |
| శాస్త్రీజీ | 44 |
| గీతోద్భవ స్థలం కురుక్షేత్రం | 45 |
| 1) అష్టమ స్వరం 2) చందమామ అందినరోజు | 48 |
| గళ్ళ నుడి కట్టు | 49 |



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

పాఠక దేవుళ్ళకు విజయదశమి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు -- పత్రిక పుష్కరం శుభాకాంక్షలు

మన 'చైతన్యం సంకల్పబలం' పత్రిక పాఠక దేవుళ్లు, సాహితీ సంపన్నులైన సరస్వతీ ప్రతిరూపంతో ఉన్న రచయితీ రచయిత్రులు, గాన మాధుర్యాన్ని గాత్ర మాధుర్యం తో అందిస్తున్న గాయనీ గాయకులు తమ గానామృతంతో మనసులను మైమరపిస్తూ, వాయిద్యాలతో మనల్ని ఆనంద డోలికల్లో మైమరపిస్తున్న కళాకారులు, వీరందరి అండదండలతో, ప్రోత్సాహంతో మన పత్రిక పుష్కరం చేసుకుంటోంది.

12 వసంతాలు పూర్తి చేసుకుని, 13 వ వసంతంలోకి ఉర్రూతలూగుతూ , , ఉరకలతో ఆనందో-త్సాహాలతో, మీ ముందుకు వచ్చింది "మీ చైతన్యం సంకల్పబలం".

12 సంవత్సరాల కాలంలో మన పత్రిక ఎంతో మంది ప్రముఖులతో ముఖాముఖి నిర్వహించడం జరిగింది. అలాగే సుమారుగా 60 మంది కి పైగా సరస్వతీపుత్రులయిన రచయితలు రచయిత్రులు ఈ తరానికే కాక, తరతరాలకు ఉపయోగపడే, చరిత్ర పుటలలో నిలిచే స్థాయిలో ఎంతో అద్భుతమైన రచనలు పాఠకులకు అందించారు. ఒక్క రచనలే కాదు, మన వీడియో magazine లో రచయితలూ తమ రచనలను ఎంతో అద్భుతంగా చెప్పడం జరిగింది.

మేమందరం ఒకే కుటుంబంగా, మానసిక బంధంతో, ప్రజలకు, దేశానికి ఉపయోగ పడే అంశాలను ఒకే సంకల్పంతో తీసుకువచ్చిన పత్రిక మన చైతన్యం సంకల్పబలం. అలాగే మన పత్రిక వీడియో పత్రికగా కూడా తీసుకురావడం జరిగింది 2021 ఏప్రిల్ నెలలో ఉగాది రోజున. ఈ వీడియో సంచిక ఇంతవరకు ప్రపంచంలోనే లేదని "ఏషియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్" "ఫస్ట్ ఎవర్ వీడియో మ్యాగజైన్", "ఛాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్", "ఫస్ట్ విమెన్ ఓనర్,పబ్లిషర్ ఎడిటర్ ఆఫ్ ఏ మ్యా-గజైన్" సంచికకు ఈ రికార్డ్స్ రావడం జరిగింది. పత్రికకు ఆ సమయంలో రచనలు అందించిన రచయితలూ అందరూ కూడా సర్టిఫికెట్స్ పొందడం జరిగింది. అలాగే కొందరు రచించిన రచనలు, వారికి చదవడం వీలు కాకపోతే, కొందరు ఆత్మీయులు వాటిని ఎంతో చక్కగా చదివి వినిపించారు. మన ఇండియాలో వారే కాక, అమెరికాలో ఉన్న వారు కూడా వీడియో మ్యాగజైన్ కి ఎంతో సహకారం అందించారు. పత్రికలో భాగస్వామ్యం పంచుకున్న ప్రతీ ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలుపుకుం-టున్నాను. అలాగే మన పత్రిక ద్వారా ఎందరో గాయనీ గాయకులు ' స్వర రాగ ప్రవంతి' అనే వీడియో ద్వారా మంచి మంచి పాటలు కూడా పాఠకులకు అందివ్వడం జరుగుతోంది. ఈ ప్రోగ్రాం కి శ్రీమతి పమ్మి భారతి గారు కూడా ఎంతో అద్భుతంగా యాంకర్ గా వ్యవహరిస్తూ అందరి అభిమానాన్ని చూరగొంటున్నా-రు. మన పత్రికకు ఎంతో మంది పాఠకులు, వీక్షకులు శుభాకాంక్షలు అందజేశారు . శుభాకాంక్షలు పంపిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా మా చైతన్యం కుటుంబం తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపు-కుంటున్నాను.

పత్రిక ప్రారంభించిన కొత్తలో నేను, నాకు ఎంతో ఆప్తులుగా సహకారాన్ని అందించిన సబ్ ఎడిటర్ మధుసూదన రావు గారు నేను వ్రాసి, నేను మరచి పోయిన, ఒక నోట్ నా ముందుకు తీసుకువచ్చారు. అది వారి మాటల్లో వినండి. అది కొద్దిగా అయినా ఆచరణలో పెట్టానా? అన్నది మీరే చెప్పాలి.

## దేవీ నవరాత్రుల ప్రాశస్త్యం

అమ్మవారిని తొమ్మిది రోజులు, తొమ్మిది రూపాలలో ఎందుకు కొలుస్తారు. నవరాత్రుల వెనుక అసలు చరిత్ర ఏమిటి ..? తెలుసుకుందాం .

దేవీ నవరాత్రులు ప్రతీ సంవత్సరం ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి మొదలు నవమి వరకు దేవీ నవరాత్రులు లేదా శరన్నవరాత్రులు అంటారు. శరన్నవరాత్రులు ఎందుకు అన్నారంటే ఆశ్వయుజ మాసం నుండి వర్ష ఋతువు వెళ్లి, శరత్ ఋతువు ప్రారంభం అవుతుంది. ఈ ఋతువులో వర్షాకాలం ముగిసి చలికాలం మొదలవుతుంది. ఈ సమయంలో వాతావరణం లో కలిగే మార్పులు అనేక రోగాలకు కారణమవుతాయి. అందుకే ఈ ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి నవమి వరకు శక్తి ఆరాధన పేరుతో ప్రజలంతా శుచిగా, శుభ్రంగా ఉండి, ఎలాంటి రోగాల దరి జేరవన్నది ఈ నవరాత్రి వేడుకలు వెనుక ఉన్న చరిత్ర. అమ్మను తొమ్మిది రూపాల్లో అలంకరించి, భక్తి శ్రద్ధలతో పూజించి, అమ్మ అనుగ్రహం అందరం పొందుదాం.

## ఎన్నికలకు కౌంట్ డౌన్

### తెలంగాణ సహా 5 రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్ విడుదల

మిజోరంలో నవంబర్ 7న , ఛత్తీస్ గఢ్ లో 7,17 తేదీల్లో, మధ్యప్రదేశ్ లో 17 న, రాజస్థాన్ లో 23న పోలింగ్

తెలంగాణా ఎన్నికల షెడ్యూల్

పోలింగ్ నోటిఫికేషన్ జారీ ... నవంబర్ 3, శుక్రవారం ,

నామినేషన్లకు చివరి తేదీ ... నవంబర్ 10, శుక్రవారం

నామినేషన్ల పరిశీలన.... నవంబర్ 13, సోమవారం

నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ ... నవంబర్ 15,

బుధవారం పోలింగ్ --- నవంబర్ 30, గురువారం

ఓట్ల లెక్కింపు డిసెంబర్ 3,

ఆదివారం ఎన్నికల ప్రక్రియ పూర్తి డిసెంబర్ 5, మంగళవారం

ఎన్నికల నగారా మోగడంతో రాజకీయ పార్టీలు హోరాహోరీ పోరుకు సిద్ధమవుతున్నాయి. తెలంగాణలో నవంబర్ 30 న పోలింగ్ జరగనుండటంతో, చాలా ముందుగానే అభ్యర్థులను ప్రకటించిన భారాస ప్రచారంలో ముందుండగా .. కాంగ్రెస్, భాజపా లు జోరు పెంచాయి.

## గులాబీ దళం దూకుడు

ఒకేసారి 115 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన సీఎం కేసీఆర్ సిట్టింగ్ ఎమ్మెల్యేలలో ఆరుగురికి మినహా మిగిలిన అందరికి టిక్కెట్లు ఇచ్చారు. నాలుగైదు చోట్ల తప్ప మిగిలిన నియోజక వర్గాల్లో ఎలాంటి అసంతృప్తులు లేవని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణా ఎన్నికల నగారా మోగడంతో, అధికార భారాస వ్యూహాలతో వేగం పుంజుకుంటోంది. భారాస అధినేత ముఖ్యమంత్రి కేసీఆర్ అక్టోబర్ 15 నుంచి ఎన్నికల ప్రచారం లోకి దిగారు. ఇప్పటికే ప్రకటించిన అభ్యర్థులతో పాటు ఈ నెల 15న తెలంగాణ భవన్

లో సమావేశం కానున్నారు.

### ప్రధాని సభలతో వేగం పెంచిన భాజపా

కర్ణాటక ఎన్నికలు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి మార్పు తర్వాత భాజపాలో కొంత స్తబ్దత నెలకొన్నా, నెల రోజులుగా వేగం పెరిగింది. మహబూబ్ నగర్, నిజామాబాద్ లో ప్రధాని మోడీతో బహిరంగ సభలు నిర్వహించింది.

### ఇజ్రాయెల్ దాడులు ... గాజాలో 1300 భవనాల నేలమట్టం ... 2215 మంది మృతి

గాజాలో ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న వైమానిక దాడుల్లో 1300 లకు పైగా భవనాలు నేలమట్టమయ్యాయని నిరాశ వెల్లడించింది. మరో వైపు ఈ దాడుల్లో 2200మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్లుగా గాజా ఆరోగ్య శాఖ తెలిపింది. నెట్ వర్క్ ను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ సాగిస్తున్న వరుస దాడులతో గాజా గజ గజ లాడుతోంది.

గత పది రోజులుగా ఇజ్రాయెల్ సైన్యం జరుపుతున్న వైమానిక దాడులతో గాజా అల్లకల్లోలంగా మారింది. పెద్ద పెద్ద భవంతులు పేకమేడల్లా కూలుతున్నాయి. ఈ దాడుల్లో ఇప్పటి వరకు 1300 లకు పైగా భవనాలు నేలమట్టమైనట్లు ఐక్యరాజ్య సమితి మానవతా సంస్థ OCHA ( ఆఫీస్ ఆఫ్ కోఆర్డినేషన్ ఆఫ్ హ్యూమన్ టేరియన్ అఫైర్స్ ) తెలిపింది. ఈ మేరకు పలు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

### హమాస్ దాడుల్ని పసిగట్టక పోవడం నా తప్పే : ఇజ్రాయెల్ జాతీయ భద్రతా సలహాదారు

ఇజ్రాయెల్ పై హమాస్ దాడిని పసిగట్టక పోవడం తన తప్పేనని ఇజ్రాయెల్ జాతీయ భద్రతా సలహాదారు చేచి హెన్ గ్ బీ అంగీకరించారు. ప్రస్తుతం ఉగ్రవాదుల్ని ఏరి వేయడం లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం పనిచేస్తోందని చెప్పారు .

అక్టోబర్ 7న ఇజ్రాయెల్ పై పాలస్తీనాకు చెందిన ఉగ్రవాద సంస్థ హమాస్ మెరుపుదాడి చేసిన విషయం తెలిసిందే. 5000ల రాకెట్లతో ఇజ్రాయెల్ పై విరుచుకు పడింది. దీంతో హమాస్ దాడుల్ని పసిగట్టలేకపోయిన ఇజ్రాయెల్ ఇంటిలిజెన్స్ పై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి.

2021 లో జరిగిన యుద్ధంతో హమాస్ గుణపాఠం నేర్చుకుని ఉంటుందని భావించాం. కానీ అలా జరగలేదు. మళ్ళీ దాడులకు దిగింది. ఇప్పుడు ఎలాంటి సంప్రదింపులు ఉండవు. వాళ్ళని అంతమొందించే వరకు యుద్ధం చేస్తాం అని హేన్ గ్ బీ మీడియాకు తెలిపారు.

ప్రపంచంలోని ప్రజలంతా శాంతి మార్గాన్ని అనుసరిస్తూ, మానవ జీవితాలకు, ప్రాణాలకు విలువనిచ్చి, అందరూ కలిసి మెలిసి, ఒకరికొకరు సహాయ సహకారాలు చేసుకుంటూ, సుఖ జీవనాన్ని సాగించాలి. కక్ష సాధింపు చర్యలకు పోతే, బలయ్యేది అమాయక ప్రాణులే అని గ్రహించాలి .

ఈ విజయదశమి సందర్భంగా అందరూ, అమ్మ ఆశీస్సులు పొందుతూ, సుఖ సంతోషాలతో, విజయోత్సాహంతో ఉండాలని మీ చైతన్యం సంకల్పబలం కోరుకుంటోంది . సర్వే జనాః సుఖినో భవంతు



**తీగవరపు శాంతి**

# బతుకమ్మ పండుగ విశిష్టత



ఆశ్వయుజ మాసం వస్తోందంటే .. బతుకమ్మ పండుగ కూడా వచ్చేసినట్లే. భాద్రపద అమావాస్య నుండి తొమ్మిదిరోజుల పాటు జరిగే ఈ పండుగ తెలంగాణతోపాటు ప్రపంచంలో తెలంగాణా ప్రజలు ఎక్కడ ఉన్నా కూడా బతుకమ్మ పండుగ జరుపుకుంటారు. ఎంతో ప్రాముఖ్యత తో రాష్ట్ర పండుగగా అధికారి-కంగా, దసరాకి రెండు రోజుల ముందు వచ్చే ఈ పండుగ బతుకమ్మ పండుగ , గౌరీ పండుగ , సద్దుల పండుగ అనే పేర్లతో వ్యవహరిస్తారు.

సెప్టెంబర్ , అక్టోబర్ నెలల్లో తెలంగాణలో పండగ వాతావరణం కనిపిస్తూ ఉంటుంది. ఈ మాసాల్లో తెలంగాణా ప్రాంతం అంతా పండుగ కోలాహలంతో కనిపిస్తూ ఉంటుంది. ఈ రెండు నెలల్లో వచ్చే అన్ని పండుగలు బతుకమ్మ పండుగ కు ఒక విశిష్టమైన స్థానం ఉంది. తెలంగాణా సంస్కృతి సాంప్రదా-యాలకు ప్రతీక బతుకమ్మ పండుగ . ఈ సంవత్సరం 14 అక్టోబర్ నుంచి 22 అక్టోబర్ వరకు జరిగే ఈ పండుగ వేడుకల్లో ఏ రోజు ఏ బతుకమ్మను పూజిస్తారంటే . ఏటా ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి కి ముందు రోజు వచ్చే అమావాస్య (భాద్రపద అమావాస్య ) రోజున ఎంగిలి పూల బతుకమ్మ పేరుతో ప్రారంభమై దుర్గాష్టమి రోజు సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. అంటూ వ్యాధులు , కరువు కాటకాల బారి నుండి ప్రజల్ని కాపాడాలని ప్రార్థిస్తూ దుర్గాష్టమి రోజున సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. అంటూ వ్యాధులు , కరువు కాటకాల బారి నుండి ప్రజల్ని కాపాడాలని ప్రార్థిస్తూ ప్రకృతి గౌరిని ఆటపాటలతో, పూజించే వేడుకే బతుకమ్మ. తెలంగాణా పల్లెల్లో ప్రతి ఒక్క ఆడపడుచు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసే ఈ పండుగ వైభవాన్ని చూసేందుకు రెండు కళ్లు చాలవు-

# వార్తా విశేషాలు

## అమెరికా ప్రొఫెసర్ కు అర్ధ శాస్త్ర నోబెల్

క్లాడియా గోల్డిన్ ను వరించిన ప్రతిష్టాత్మక పురస్కారం. పురుషులతో పోలిస్తే మహిళల వెనకబాటు- కు కారణాలను సహేతుకంగా విశ్లేషించిన ప్రముఖ ఆర్థిక చిత్ర కారిణి క్లాడియా గోల్డిన్ ను ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపిక చేసినట్లు శ్వీడం లోని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సోమవారం ప్రక- టించింది. ఈమెకు 77 ఏళ్ళు. ప్రస్తుతం ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయం లో ప్రొఫెసర్ గా కొనసాగు- తున్నారు. అర్ధ శాస్త్రం లో ఇప్పటివరకు 93 మంది నోబెల్ పురస్కారం గెల్చుకున్నారు. వారిలో ముగ్గురు మహిళలు మాత్రమే గెల్చుకున్నారు. 50 శాతం మంది ప్రపంచ వ్యాప్తంగా వేతనాలతో కూడిన ఉద్యోగం మాత్రమే చేస్తున్నారు. పురుషుల్లో మాత్రం 80 శాతం దాకా అలా చేస్తున్న వారు ఉన్నారు. పురుషులతో పోలిస్తే అండ్ వేతనాలు కూడా తక్కువే. ఈ అసమానతలకు కారణాలను 200 ఏళ్ల లేబర్ మార్కెట్ డేటాను విశ్లేషించడం ద్వారా క్లాడియా వివరించారు.

## పెళ్లి రద్దు అన్ని వేళలా సరైనది కాదు ... సుప్రీం కోర్టు

అధికరణం 142 కింద వివాహబంధం పునరుద్ధరించ లేని విధంగా విచ్ఛిన్నమైందన్న కారణంతో పెళ్లిని రద్దు చేసే అధికారం సర్వోన్నత న్యాయస్థానానికి ఉందని, అయితే, ఈ విచక్షణాధికారాన్ని చాలా జాగ్రత్తగా ఆచి తూచి వినియోగించాలని సుప్రీంకోర్టు అభిప్రాయం పడింది.

వివాహాన్ని రద్దు చేసే అధికారం సర్వోన్నత న్యాయస్థానానికి ఉన్నప్పటికీ, ఆ విచక్షణాధికా- రాన్ని ఆచి తూచి వినియోగించాల్సిన అవసరసం ఉందని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. భారత సమాజంలో వివాహ వ్యవస్థను పరమ పవిత్రంగాను, ఒక ఆధ్యాత్మిక కలయికగానూ చూస్తారని .. కావున ఆర్టికల్ 142 కింద .. వివాహ బంధం విచ్ఛిన్నమైందని, అందరినీ ఒకే గాడిన కట్టకూడదని తెలిపింది. 89 ఏళ్ల వృద్ధుడు 82 ఎల్లా భార్య నుండి విడాకులకు చేసిన పిటిషన్ పై విచారణ సందర్భంగా జస్టిస్, అనిరుద్ధ బోస్, జస్టిస్ బి. ఎం త్రివేదీలతో కూడిన దేవీసభ్య ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. ఆమె విడాకులు కోరుకోవడం లేదని, విడాకులు తీసుకున్న మహిళా అనే కళంకంతో తాను చనిపోవాల- ని కోరుకోవడం లేదని పేర్కొనడంతో, ధర్మాసనం వృద్ధ దంపతులకు విడాకులు ఇచ్చేందుకు నిరాకరిం- చింది.

## పుదుచ్చేరి రవాణాశాఖ మంత్రి రాజీనామా

### లైంగిక వేధింపులకు గురైనందుకె రాజీనామా

ఎన్నార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పుదుచ్చేరి రవాణా శాఖ మంత్రి చంద్ర ప్రియాంక తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. రాజీనామాకు కారణాలను వివరిస్తూ .. ప్రజలకు ఆమె ఓ లేఖ విడుదల చేశారు. అణగారిన వర్గానికి చెందిన నేను కుల పరంగా, లైంగిక పరంగా వేధింపులకు గురయ్యాను. ఆధి- పత్య శక్తులకు వ్యతిరేకంగా పోరాడుతూ, మంత్రిగా కొనసాగలేను, అంటూ లేఖలో పేర్కొన్నారు.

# శుభాకాంక్షలు



భువనచంద్ర




అంతులేని చైతన్యమె నీది
మొక్కవోని సం కల్పబలం నీదే నీదే నీదే
దిన దినము ఎదుగుతున్న ఓ పుత్రిక
ఈ పుష్కర విజయోత్సవం నీది నాది మనది

పాఠక మిత్రులే నీకు దేవుళ్ళు
రచయితలందరూ నీకు సహోదరులు
అంతులేని విజ్ఞానం అందిస్తావు ఎంచక్కని కథలతో అలరిస్తావు
నీకు సాటి ఎవరంటేనువ్వేనమ్మ
ఈ పుష్కర విజయము మనదేనమ్మ

తరగని పెన్నిధులు సంపాదకీయాలు
నీ శీర్షికలన్నీ
సాహిత్యాభరణాలు
పన్నెండేళ్లుగ నువు వెదజల్లిన అక్షరాలు
ఎన్నటికీ చెరిగిపోని శిలాక్షరాలు
తెలుగు తల్లి పాదాలకు **బంగారు కడియాలు**

# ఆత్మీయ శుభాకాంక్షలు



సామాజిక విలువలతో కూడిన మన 'చైతన్యం మాస పత్రిక'.. 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భాన..

పత్రిక ఎడిటర్ శ్రీమతి తీగవరపు శాంతి గారికి, పత్రికను ముందుకు తీసుకు వెల్లడములో ఇప్పటి వరకు ఆవిడ కి అహర్నిశలు సహాయ, సహకారములు అందించే శ్రీ తీగవరపు ప్రసాద్ గారికి..

నా తరపున,మా కుటుంబం తరపున హృదయ పూర్వక అభినందనలు తెలియ చేస్తున్నాను.

దసరాలు వస్తున్నాయి అంటే అమ్మ వారి 'నవరాత్రి ఉత్సవ పండుగలు' జరుపుకోవచ్చు అని ఎలా సంతోష పడతామో..

అలాగే! 'మన చైతన్యం మాసపత్రిక ప్రారంభం కూడ' ఈ పండుగ నాడు జరిగింది కదా అనే ఒక జ్ఞాపకము, సంతోషంగా మనసు నిండుగా తలుచుకోవడం, ప్రతీ సంవత్సరం ఆ వార్షికోత్సవాలను జరుపుకోవడం అన్నది నేను ఒక ఆనందముగా అనుభవిస్తూ వచ్చాను.

అంతేకాదు! కృష్ణ,గోదావరి,త్రివేణి సంగమం(అలహాబాద్), తదితర గొప్ప నదులకి '12 సంవత్సరాల-కి' ఒక్కొక్కసారి పుష్కరాలు సంభవిస్తూ, ఆ సమయాల్లో అందు స్నానమాడే భక్తులకు ఎంతో పవిత్రత, పుణ్యం చేకూరుతాయి అని సహజంగా అందరు ఎలా భావిస్తారో..

**ఇక ముఖ్యంగా 'మన చైతన్యం మాసపత్రిక, అలాగే వీడియో రూపకంగాను' 12 సంవత్సరాలు అంటే ఒక పష్కరం కాలం పూర్తి చేసుకోవడంతో పాటు, అందు ఎంతో మంది గొప్ప గొప్ప రచయి-తలు, రచయిత్రులు, ఎంతో మంది కవుల కలాల నుండి జాలువారుతున్న రచనలు, శీర్షికలు, హితో-క్తుల వలనే కాక.. ఎడిటర్ శాంతి గారు అందించే సంపాదకీయాలతో మన పత్రిక ఇప్పటి వరకు ప్రతి మాసం ఒక ప్రవాహం లా సాగుతుండడమే గాక..

ప్రపంచ వ్యాపితంగా వున్న ఎంతెంతో మంది తెలుగు వారందరికీ గొప్ప అభిమాన మాస పత్రిక అయ్యింది.

నేను సహితం ఒక రచయిత్రిగా ఈ పత్రికలో 'మిస్ మేఘమాల IAS' అనే సీరియల్ ని ఇవ్వగలగడం నా వంతు అదృష్టంగా భావిస్తున్నాను.

ఇంకా ఇలాగే ఎన్నెన్నో విశిష్ట మైన విషయాలన..ఇందు పొందుపరచాలని వున్నా,సమయాన్ని మించి వుండకూడదని ఇంతటితో ముగిస్తున్నాను.

*మరొక్కసారి స్నేహశీలి ఎడిటర్ శాంతి గారికి మనసా, వాచా అభినందనలు,ఆల్ ది బెస్టు, కృత-జ్ఞతలు తెలుపుతు., మరెన్నెన్నో పుష్కరాలు ఈ పత్రిక సంపాదించుకుంటూ, మరింగా అభిమానుల మెప్పును పొందాలని కోరుకుంటూ..

- - నండూరి సరోజా దేవి

# ముదితల్ నేర్వగరాని విద్య కలదే ముద్దార నేర్పించినన్....

మత్స్యరాజు విజయలక్ష్మి

ఆ రోజు ఉపాధ్యాయ దినోత్సవం. ఉపాధ్యాయుల దినోత్సవం మన దేశంలోనే కాకుండా మరికనిన దేశాలలో జరుపుకుంటారు. అది 1999వ సంవత్సరం. సెప్టెంబరు 25 ఉపాధ్యాయ దినోత్సవం. నేనప్పుడు బ్రునై దేశంలో ఉన్నాను. ఒక అంతర్జాతీయ పాఠశాలలో పని చేసేదాన్ని. ఆ పాఠశాలలో 32 దేశాల నుండి వచ్చిన విద్యార్థులు దాదాపు అన్ని ఖండాల నుండి ఉండేవారు. ఆ రోజు చాలా విచిత్రంగా గడిచింది. నేను ఎప్పటి మాదిరిగానే ఉదయం 7 గంటలకు పాఠశాలకు చేరుకున్నాను. (పాఠశాల సమయం 7.30 నుండి 12.30వరకు) వెళ్లేసరికి నోటీసుబోర్డుమీద వారికిష్టమయిన అధ్యాపకులకు / అధ్యాపికలకు రకరకాల గ్రీటింగ్ కార్డ్సు అతికించారు విద్యార్థులు. దాంట్లో ఒకటి నా దృష్టిని ఆకర్షించింది. ఒక అమ్మాయి ఇలా వ్రాసింది. నేను పెద్దయిన తర్వాత పైలట్ అవుతాను. అప్పుడు నా మొదటి ప్రయాణం నా టీచరుతో చేస్తాను అని. నాకు చాలా గ్రీటింగ్ కార్డ్సు వచ్చాయి. అన్నీ తీసికొని భద్రపరచుకున్నాను. ఏవో పిల్ల చేష్టలు కాకపోతే ఈ అమ్మాయి పైలటం అవుతుందా, అయినా నన్ను తీసుకెళుతుందా, అదే నా మీద ప్రేమతో అలా వ్రాసి ఉంటుందిలే అనుకున్నాను. అదే రోజు సాయంత్రం ఉత్సవం జరిగింది. నాకు మోస్ట్ పాపులర్ టీచర్ అవార్డు వచ్చింది. సంతోషం. కాని ఆ మరుసటిరోజు నుండి ఆ అమ్మాయి తన ఇంటిపేరును మార్చేసి దాని బదులు పైలట్ అని వ్రాసుకునేది. నేను నవ్వుకునేదాన్ని. ఇలా రెండు సంవత్సరాలు గడిచాయి. నేను, మావారు 2001లో అమెరికా వెళ్ళాము. విజిటింగ్ ప్రొఫెసర్ గా (3 సంవత్సరాల కోసం). కాలగమనంలో 2022వ సంవత్సరం వచ్చింది. అది కూడా అయిపోవచ్చింది. 2022 డిసెంబరులో ఒకరోజు ఫేస్ బుక్ లో నాకు ఒక ఫ్రెండ్ రిక్వెస్ట్ వచ్చింది. ఆ అమ్మాయి ముఖం ఎక్కడో చూసినట్టుంది. పేరు మారిపోయింది. సరే అని ఆక్సెప్ట్ చేసాను. నేను మీ శిష్యురాలిని గుర్తున్నానా అని తన వివరాలు చెప్పింది. అప్పుడు నేనడిగాను, “నువ్వు పైలట్ అని నీ పేరు చివర వ్రాసేదానివి కదా మరింతకీ ఏం చదువుకున్నావు అన్నాను. ”ఫేస్ బుక్ (డి.పి)లో నా ఫోటో చూడలేదా మీరు అని అడిగింది. నేను నిజంగానే పైలట్ అయ్యాను మేడం” అంది. నా ఆనందానికి అవధులు లేవు. 10 ఏళ్ల పాప తను పైలట్ కావాలని నిశ్చయం చేసికొంది. సాధించింది. ఎలా సాధ్యమయిందని అడిగాను. నేను బ్రునైలో ఉన్నప్పుడు వాళ్ల నాన్నగారు డాక్టరుగా ఉండేవారు. వాళ్లమ్మ చదువుకున్నదే అయినా ఉద్యోగం చేసేది కాదు. పరదా పద్ధతి. అలాంటి కుటుంబంలో పుట్టిన అమ్మాయి. తన పైలట్ చదువుకోసమని తండ్రిని ఒప్పించి 2001లో కుటుంబాన్ని కెనడాకు తరలించింది. స్కూలు తర్వాత ఫ్లయింగ్ స్కూల్ లో చేరి తన ఆశయాన్ని నెరవేర్చుకుంది. “నాకు పెళ్లయింది మేడం. నలుగురు పిల్లలు” అని గర్వంగా చెప్పింది. ఒకవైపు విధి నిర్వహణ, మరొక వైపు కుటుంబ ఆలనా

(40 వ పేజీ చూడండి)

# ద్రౌపది



పాలకుర్తి రామమూర్తి

(గత సంచిక తరువాయి)

## ద్రౌపది అంతరంగ ఆవేదన (వస్త్రాపహరణ నేపథ్యం లో)

అంతేకాని మయ సభ లో దుర్యోధనుని భంగపాటును చూచి ద్రౌపది నవ్విందనుకోవడం సరైనది కాదు (దుర్యోధనుని దురాలోచన శీర్షిక లో దుర్యోధనుడు తండ్రి వద్ద తన ఆవేదనను చెప్పుకున్న సన్నివేశం లో ఇది స్పష్టం గా కనిపిస్తుంది.)

మూలం లో ద్రౌపది నవ్వినట్టుగా లేకపోయినా నాటకీయత కోసం నన్నయ గారిచే ద్రౌపది నవ్వినట్టుగా వ్రాయబడ్డా... ఒక విషయాన్ని ముఖ్యంగా ఇక్కడ గమనించాలి. సభ లో గురువులు మంత్రులు సామంతులు పౌరులు అంతఃపుర స్త్రీలు... ఇలా ఎవరెవరు ఎక్కడెక్కడ కూర్చోవాలో నిర్ణయమై ఉంటుంది. అంతఃపుర స్త్రీలు సౌధోపరి భాగం లో కూర్చుంటారు. సౌధోపరి భాగం నుండి చూస్తున్న ద్రౌపదికి క్రింద దుర్యోధనుని భంగపాటు కనిపించినా దుర్యోధనునికి ద్రౌపది కనిపించే అవకాశం లేదు. అంతేకాదు ఉత్తమ స్త్రీత్వం మానవతా లక్షణాలు మూర్తీభవించిన ద్రౌపది లాంటి స్త్రీలు ఎదుటివారి పరాభవాన్ని చూచి నవ్వుతారనుకోవడం సమంజసంగా తోచదు. అయితే పై నుండి పరిచారికలు నవ్వియుండవచ్చు. తన భంగపాటు నెవరైనా గమనించారా అని దుట్టూ చూస్తున్న దుర్యోధనునికి (అలా చూడడం మానవసహజం కూడా) ఆ నవ్వులు వినిపించడం వెంటనే ద్రౌపది కనిపించడం జరిగి యుండవచ్చు. లేదా తన పరాభవానికి ఒక ఆడది కారణమని చెప్పి నప్పుడు ఆ ఆడదానిని తానెంత అవమాన పరచినా తనను వేలెత్తి చూపే వారు ఉండరనే దుర్మార్గపు ఆలోచన కూడా అయి ఉండవచ్చు. వెరసి రాక్షసత్వం రాజ్యమేలిందక్కడ.

ద్రౌపది తన వాదనను ఆరంభిస్తుంది. తన రాజ్యాది భౌతిక సంపదలు పోతే పోవచ్చు గాక..అయినా ధర్మమార్గంతప్పని ధర్మరాజు ధన్యుడు అంటుంది. ఇక్కడ సునిశితంగా ఆలోచించాలి. ధర్మరాజు అవివేకం వల్ల, వ్యసన పరత వల్ల, తొందర



పాటు వల్ల ఈ అనర్థం జరిగింది. తమ్ములు ఎంతగా అన్న గారి మాటను అతిక్రమించని వారైనా తమనూ... ద్రౌపదినీ జూదం లో ఓడి కౌరవుల దాసులుగా చేయడం వారికి మ్రింగుడు పడక పోవచ్చు. సభ లో తమ భార్యను అవమానిస్తున్నప్పుడూ చేవగలిగీ మౌనం గా కూర్చొనవలసి రావడం వల్ల వారి బాధ ద్విగుణీకృత మౌతుంది. అవమాన భారం బాధ వల్ల వారు అన్నగారిపై రెచ్చి పోవచ్చు. ఈ అపత్కాలంలో అన్నదమ్ముల మధ్య సయోధ్య చెడి వైషమ్యాలు పెరిగితే అనర్థదాయకమౌతుంది. కాబట్టి ముందుగా సూచన ప్రాయంగా ధర్మజుని ధర్మజ్ఞతను ప్రస్తావిస్తుంది ద్రౌపది. అలాగని ప్రత్యక్షం గా వారికే చెప్పలేని పరిస్థితి.... చెపితే అది వారి ఆత్మ న్యూనతను పెంచుతుంది. అందుకే అన్యాపదేశం గా చెప్పడం జరిగింది.



ఇక "కురువృద్ధులారా" అనడంవల్ల భీష్మ ధృతరాష్ట్రాదులను ఆశ్వాసిస్తుందామె. ఇక్కడ భేదోపాయం వల్ల కార్యాన్ని సాధించడం ఆమె లక్ష్యం. దుశ్శాసనుడు తన వెండ్రుకలు పట్టి ఈడ్చిన విధానం గమనించినా పెద్దలెవరూ వారించలేదు. తమకు పట్టనట్లున్నారు. ఈ సంబోధన వల్ల వారికి తప్పుకునే అవకాశం లేకుండా పోయింది. మాట్లాడక పోతే ఈ తప్పిదాన్ని వారు ఆమోదించినట్లవుతుంది. వారికది మాయని మచ్చ అవుతుంది. దీనిని వారంగీకరించక ధర్మాన్ని మాట్లాడితే తనపని సగం నెరవేరినట్లే. కౌరవులు ఒంటరి వారవుతారు.

సభలో కలకలం. కౌరవులు మాయాజూదం లో పాండవుల రాజ్యాన్ని హరించడమే కాక నిండు సభ లో అబలనవమానిస్తున్నారనే గుసగుసలు. దురదృష్టం వెన్నాడగా కౌరవుల దుర్నీతికి పాండవులు బలైనారన్న వేదన వారిలో నెలకొంది. అంతేకాక "ధర్మజుడు ధర్మ పథం తప్ప ద్రొక్కునే" అనడం తో ఒకవైపు భార్య అవమానింపబడుతున్నా ధర్మ మార్గాన్ని వీడని వారి ధార్మిక విధానం ఆవిష్కరిస్తూ .. మరొక వైపు కౌరవ్యుల అధార్మికతను సభకు తెలియ చేస్తుంది. దీనితో పాండవుల పై.....ద్రౌపది పై సభ్యులకు సానుభూతి పెరిగి పోయింది. దుర్మార్గమైన అధికారానికి భయ పడినా వారి మనసులలో కౌరవులపై ఏహ్య భావాన్ని నింపగలిగాయి ఆమె మాటలు.

సభను చూచింది. సభాసదులపై తన మాటలు ప్రభావాన్ని చూపుతున్నాయి. పరిస్థితిని అంచనా వేసింది. భీష్మ ద్రోణ విదురాదుల ముఖాలపై మారుతున్న రంగులు కనిపెట్ట

గలిగింది. కౌరవ సమూహం లో ఊహించని పరిణామ మది. వారి లో ఆవరించిన స్తబ్ధతను పరికించింది. ఇనుము వేడిగా ఉన్నప్పుడు సమ్మెట పోటు పడితేనే ఆశించిన ఆకారం వస్తుంది. అందుకే అడగవలసిన విషయాన్ని సూటిగా ప్రస్తావించింది.

...."భృశ కోపను డీతడు నన్ను నేల దుర్జనుడిట( నీడ్చి తెచ్చె నవిచారపరుండయి దుర్మదంబునన్" అంటూ సభను ప్రశ్నించింది.

భృశ కోపనుడై (అధికమైన కోపము కలవాడై) దుర్జనుడైన ఈ దుశ్శాసనుడు మదంచేత మంచిచెడ్డలు విచారించకుండా నన్నెందుకు ఈ సభకు తల వెండ్రుకలు పట్టి యీడ్చుకొని వచ్చాడు అంటూ అడగ దలచిన విషయాన్ని విస్పష్టంగా తడబాటు లేకుండా భావోద్వేగాల కతీతంగా ధర్మాధర్మ చర్చకు దారితీసేవిధంగా ప్రశ్నించింది.

స్వతహాగా దుశ్శాసనుడు దుర్జనుడు.. మాయా జూద విజయం తో మదించి యున్నాడు. కోపిష్ఠియై, మంచి చెడ్డల తారతమ్యం గుర్తించని వాడు. అబలయని చూడకుండా సరైన కారణం చెప్పకుండా తల వెండ్రుకలు పట్టి సభా స్థలి మధ్యకు యీడ్చుకొని రావడం.. సభాసదులలో కౌరవులపై వ్యతిరిక్త భావనను నింపగలిగింది.

"ఇది యుచితంబు గాదనక యిక్కురు ముఖ్యులు సూచుచుండ దుర్మదుడయి వీడు నన్ను నవమానిత( జేసెడి సర్వ ధర్మ సంవిదులన నున్న యీ భరత వీరుల వంశము నే డధర్మ సంపద నతి నింద్య మయ్యె నని భామిని గృష్ణ దలంచె భీతయై!

తనకు జరిగిన అవమానం అధర్మమైనదని ఎలుగెత్తి చెప్పింది. ఎవరూ పట్టించుకోలేదు. తన ఆత్మ విశ్వాసం తప్ప ఆ సభ లో తనకు అంగ బలం లేదు. సకల భువన రక్షాదక్షులై రాజ చక్రాన్ని శాసించగలిగిన నాథులున్నా ఆ సమయం లో తనా సభలో అనాథ యే అయింది. తన ప్రశ్న కు బదులీయని పెద్దలనుగానీ సభ్యులనుగానీ తాను లెక్కించాల్సిన అవవసరమూ లేదు. గౌరవించ వలసిన అవసరం లేదు. ఎవరినీ ప్రాధేయ పడడం వల్ల ప్రయోజనమూ లేదు.న్యాయ పోరాటం లో తన హక్కును దుర్మార్గం కాలరాస్తున్నా అడ్డుకునే చేవలేని సమాజాన్ని ఏవగింపుతో చూస్తూ... అనుకుంటుంది...

ఉచితానుచితాలు తలపకుండా, పెద్దలున్న సభలో, సర్వ ధర్మములను చక్కగా తెలుసుకొని ఆచరించే మహాత్ములు జన్మించిన ఈ వంశం లో, స్త్రీనని.. సోదరుల భార్యననీ.. రజస్వలననీ.. ఏకవస్త్రననీ చూడకుండా తల పట్టి యీడ్చే దుష్కృత్యానికి పాల్పడ్డ దుర్మదుడైన దుశ్శాసనుడి లాంటివారు శిక్షింపబడడం లేదు. సామ్రాజ్ఞినైన నాకే ఇంతటి అవమానం జరిగితే సామాన్యుల పరిస్థితి ఏమిటి. పెద్దలు చూస్తూకూర్చున్నారు.. అంటే ఈ భరత వంశం అధర్మ సంపద చేత అన్యాయ సైరణ చేత నింద్య మైంది. దూషింపదగినదయింది. " యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః" ఎక్కడయితే స్త్రీ లు పూజింపడతారో అక్కడ దేవతలు ఆనందిస్తారనికదా చెపుతారు.. మరి విజ్ఞులైన కురు వృద్ధుల సమ్ముఖం లో కులస్త్రీ అవమానింపబడడం దుస్సహస్థితి కదా!

ఆమె ప్రశ్న లో నిజాయతీ ఉంది.. స్థిరమైన వ్యూహం ఉంది. అన్యాయాన్ని ప్రశ్నించ గలిగిన ధైర్యం ఉంది. దుర్మార్గాన్ని ఎదిరించగలిగిన సాహసం ఉంది. ఎదుటి వారిపై తన మాటలు ఎలా పనిచేస్తున్నాయో పసిగట్టగలిగే మానసిక వికాసం ఉంది. పలుకు లో ఆవేదన ఉంది. ఎదుటి వారి భావోద్వేగాలను తనకనుగుణం గా మలచుకొన గలిగే వాక్చతురిమ ఉంది. అశక్తతను అధిగమించగలిగే నిర్ణయాత్మక శక్తి ఉంది.

కాని అజ్ఞాన బధిరులు వ్యామోహాంధులు అధికారం వెలగబెడుతున్నారు. అవివేకం రాజ్యమేలుతుంటే.. అజ్ఞానం మంత్రాంగం నెరుపుతూఉంటే..రాక్షసత్వం వికటాట్టహాసం చేస్తుంటే విజ్ఞానం మౌనం దాలుస్తుంటే అసమర్థత ఆవలిస్తుంది. చేవలేని సమాజం భయాన్ని ఆశ్రయించింది. ఒక్క అబల తనకు అన్యాయం జరిగిందనీ న్యాయం చేయండనీ సభ నాశ్రయిస్తే స్పందించని సభ్య

సమాజాన్ని చూచి న్యాయమే తలవంచుకోవలసి వచ్చింది.

తప్పు చేసివ వారిని కాక తప్పును ప్రశ్నిస్తున్న ద్రౌపది ప్రశ్న లోని ధర్మబద్ధతను ఆవేదనను అర్థంచేసుకున్న వికర్ణుడు ఇలా అంటాడు.... "సమ చిత్త వృత్తులగు బుద్ధిమంతులకు నిపుడు ద్రౌపదీ ప్రశ్న విచారము సేయ వలయు" నవిచారమున బ్రవర్తిల్లుటది నరక హేతువగున్!

అంతే కాదు.. కురువృద్ధులు మరియు గురువులు ఎవరూ ఆమె ప్రశ్నకు బదులీయడం లేదు కాబట్టి "నేనిందు ధర్మనిర్ణయము సేసెద" అంటూ .. ద్రౌపది అధర్మ విజిత .. యిక్కేమలి నేక వస్త్రను రజస్వలనిట దోడ్కొని తెచ్చుట న్యాయం అంటాడు..

ఇక్కడ వికర్ణుడి పలుకులామోదింపబడ్డాయా లేదా అనే దానికన్నా ద్రౌపది ప్రశ్న లోని ఆవేదన ఆమోదింపబడిందనేది ముఖ్యం గా గమనించాలి. ఆమె వాదన లోని ఔచిత్యం సభ లో ఒప్పుకోబడింది. తన వాదన న్యాయ బద్ధ మైనది అనే విషయం ఆవిష్కరింపబడింది. నీ వాదన సమంజసమైనదే నీకు నేను తోడున్నాననే సాంత్వనా పూరిత సందేశం ఆమెకు లభించింది. ఆత్మీయ వేదన బలంగా ఆవిష్కరింపబడింది. తన వాదన స్పష్టంగా ఎదుటి వారి హృదయాలలోకి చేరడం, తనవైఖరి, దృక్కోణం సమంజసమైనవని ఆమోదింప బడడం వల్ల న్యాయం జరిగే అవకాశాలు ఆశలు మెరుగయినట్లే. తన లోని అంతర్వేదన ఆ మేరకు ఉపశమించినట్లే.

చివరి ఫలితమే నిర్ణయాత్మకమైనది కావచ్చు కాని దానికి కట్టు బడడం కన్నా ప్రయత్న లోపం లేకుండా యత్నించడానికి కావలసిన ధైర్యం పట్టుదల వాక్చాతుర్యం ఆమె మాటలలో సంపూర్ణం గా వెలుగు చూచాయి. ముఖ్యంగా ఆమె లోని ధైర్యమే ఆమె వాదనను ఆవిష్కరించేందుకు సహకరించింది, స్థిరత్వాన్నిచ్చింది, తనమార్గం లో నడచేందుకు చేయూత నిచ్చింది. బాధలు అవమానాలే గురువులై ధైర్యాన్ని ప్రసాదించగా.. మాటే మంత్రమనే నానుడిని సార్థకంచేస్తూ తొట్రుబాటు లేకుండా భావోద్వేగాలకతీతంగా వ్యవహరించిన ఆమె వ్యవహారశైలియే ఆమె పట్ల సభ్యుల సకారాత్మక వైఖరికి మూలమైంది.

సహేతుకమూ, సమంజసమూ, దర్మసమ్మతమూ అయిన వికర్ణుడి పలుకులను దుర్మదాహంకార చేతస్కులైన కౌరవాళి ఆదరింపక పోవడం.. దుర్నీతి పరులైన వారి చేష్టలను అదుపుచేయడం లో పెద్దరికం విఫలం కావడం.. విదురుని హిత బోధలు అనాదరింపబడడం... ఇదంతా గమనించిన ద్రౌపది మనస్సు దాదాపు స్తబ్ధమై .. తన నాదుకునేవారు లేరనే భావనతో నిశ్చేతనమై పోయింది. అయినా పట్టుదల వీడక చివరి వరకూ పోరాడే మానసిక చైతన్యం తో అశక్తత లో పెల్లుబికే దుఃఖాన్ని ఆపుకుంటూ ..ఇలా అంటుంది..

మంత్రి సామంత దండనాథ పరిజనులు చూస్తూండగా సభా మధ్యంబున దుర్వినీతులైన కౌరవులచే పరాభవింపబడి.. న్యాయం కోసం విజ్ఞుల నాశ్రయించి.. ధర్మ సమ్మతంగా నేను దాసినా కాదా అన్న ప్రశ్న వెలయిస్తే ఎవరూ ఎందుకని జవాబు చెప్పడం లేదు... అంటూ మరొక మారు సభనుద్దేశ్యించి రెట్టిస్తుంది.

లక్ష్యాన్ని సాధించేందుకు అవసరమైన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే ప్రయత్నం చేసిందామె. ధర్మం న్యాయం తనను రక్షిస్తాయనే సంపూర్ణమైన విశ్వాసం అమెలో ఉంది. పట్టువిడని పోరాట పటిమ ఆమె సొత్తు. సహేతుకమైన వాదన అన్యాయాన్నెదిరించే తెగువ ... మూర్తీభవించిన ఉదాత్త మానసి ద్రౌపది.

కాని అమానుషత్వం, రాక్షసత్వం ముందు అబల ఆక్రందన విర్వీర్య మయింది. కర్ణ దుర్యోధనుల అసభ్య ప్రవర్తన .... దుశ్శాసనుని అమానుష చర్య సభ్య సమాజం తలదించుకునే సంఘటనకు తెరదీసింది. బహుశా ద్రౌపది అంతరంగం చైతన్య రహితమై ఉంటుంది. నిస్తేజమై, అశక్తత తో కూడిన నిర్వికారం తో తనను ఆదుకునే వాడు

(42 వ పేజీ చూడండి)

# ఆంధ్రుల అభిమాన అత్తగారు సూర్యకాంతం



పోడూరి శ్రీనివాసరావు

ఈ ప్రపంచం లో కొన్నిటికి ప్రత్యేకం గా పరిచయం అక్కరలేదు. ఉదాహరణకు...
మండు వేసవిలో మల్లెపూల పరిమళం, కొత్తావకాయ, ఆకు కూరలు అన్నిటికీ తల్లి లాంటి శాకాంబరీ మాత..గోంగూర పచ్చడి, కొత్తగా పెళ్ళైన నూతన దంపతుల మధ్య అనురాగాలు, అలకలు, పౌరాణిక పాత్రల్లో ఎన్టీఆర్, ఎస్వీఆర్ ల నటన ... అబ్బో.. ఇలా ఒకటేమిటి, కొన్ని అలా ప్రత్యేకతలు సంతరించుకున్నాయి.
అలాంటివాటిలో ఒకటి .. శ్రీమతి సూర్యకాంతం నటన కూడా చెప్పుకోతగినదే.
ప్రత్యేకంగా, ఈ ప్రత్యేక సంచికలో శ్రీమతి సూర్యకాంతం నటన గురించి ప్రస్తావించడానికి కూడా ఒక ప్రత్యేక కారణం ఉంది. ఈ సంవత్సరం శ్రీమతి సూర్యకాంతం శతాబ్ది సంవత్సరం... అక్టోబర్ 28, 2023 తో ఆమెకు 99 సంవత్సరాలు పూర్తయి, శతాబ్ది సంవత్సరం (1924 -2024) మొదలవుతుంది. అందుకే, ఆ ప్రత్యేకతను పురస్కరించుకుని, ఆమెపై వ్యాసం వ్రాయ సంకల్పించాను.

గయ్యాళి పాత్రలకు పేరుగాంచిన సూర్య కాంతం 28, అక్టోబర్ 1924 తేదీన, తూర్పు గోదావరి జిల్లా లోని కాకినాడ సమీపం లో వెంకట కృష్ణ రాయపురం గ్రామంలో శ్రీ పొన్నాడ అనంత రామయ్య, శ్రీమతి వెంకటరత్న మ్మ దంపతులకు 14 వ సంతానంగా జన్మించింది.
[2:49 AM, 10/9/2023] Pod: ఆరేళ్ల వయసులోనే, పాడడం, నాట్యమాడడం నేర్చుకుంది. వయసు పెరిగే కొద్దీ హిందీ సినిమా పోస్టర్లు ఆకర్షించడంతో, సినిమాల్లో నటించాలనే కోరికతో మద్రాసు (ప్రస్తుత చెన్నై)



చేరుకుంది.

మొదట జెమిని స్టూడియో నిర్మించిన చంద్రలేఖ సినిమాలో డాన్సర్ గా అవకాశం వచ్చింది. నెలకు 65 రూపాయల జీతం ఇవ్వబోతే నిరాక-రించ డంతో నెలకు 75 రూపాయల జీతం నిర్ధారించ బడింది. తర్వాత 1949 లో ధర్మాంగద చిత్రంలో మూగదాని వేషం వేసింది. ఆ సమయంలో చిన్నా చితకా వేషాలు వేసేది. అప్పుడే మొదటి



సారిగా, నారద నారది సినిమాలో సహాయ నటిగా అవకాశం వచ్చింది. అప్పుడు వేస్తున్న చిన్నా చితకా వేషాలు నచ్చక జెమిని స్టూడియో నుంచి బయటకు వచ్చేసింది. బొంబాయి వెళ్దా-మనుకునే ఆలోచన మనసులో ఉన్నా, ఆర్థిక స్థోమత లేక ఆ ఆలోచనను విరమించు కుంది.

అటువంటి సమయంలో ఆమెకు గృహప్రవేశం సినిమాలో సహాయనటిగా మంచి అవకాశం వచ్చింది. పిమ్మట తన కలల పాత్ర, హీరోయిన్ వేషం - సౌదామిని చిత్రంలో వచ్చింది. కానీ, ఆ సమయంలో కారు ప్రమాదం జరిగి, ముఖానికి గాయం అవడంతో ఆ అవకాశం కాస్తా తప్పి పోయింది. గాయం బాగయ్యాక సంసారం చిత్రంలో మొట్టమొ-దటిసారిగా గయ్యాళి అత్త పాత్ర వచ్చింది. ఆ పాత్రను అత్యద్భు-తంగా పోషించడంతో, ఆ తర్వాత సూర్యకాంతానికి వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరమే లే-కపోయింది. గయ్యాళి అత్త పా-త్రలకు తను పేటెంట్ గా, బ్రాండ్ అంబాసిడర్‌గా అయి పోయింది.

Pod: సంసారం చిత్రం తర్వాత బొంబాయి కి చెందిన ఒక నిర్మాత ద్వారా... తను కోరుకునే హీరోయిన్ పాత్ర వచ్చింది. కానీ తనకు ఆ అవకాశం రాక ముందే ఆ పాత్రకు మరొక హీరోయిన్ ని తీసుకొని, తర్వాత ఆమెను ఆ సినిమా నుంచి తీసేసారని తె-లియడంతో... ఒకరి బాధను నా సంతోషంగా తీసుకోలేను... అంటూ ఆ సినిమాను నిరాకరిం-చింది. కోడరికం సినిమా ఆమె-కు ఎంతో పేరు తీసుకొచ్చింది.



ఆ రోజుల్లో అనేక చిత్రాల్లో సూ-ర్యకాంతం నటించింది. ఒక విధంగా చెప్పాలంటే, సూర్యకాం-తం నటించని సినిమా ఉండేది కాదు. కొత్త సినిమా వస్తుంటే... అందులో సూర్యకాంతం ఉందా, లేదా అని ప్రేక్షకులూ, సినిమా డిస్ట్రిబ్యూటర్లు ఎదురుచూసే-వారంటే అతిశయోక్తి కాదేమో. ముఖ్యంగా సాంఘిక చిత్రాల్లో రేలంగి - సూర్య కాంతం, రమ-ణారెడ్డి - సూర్యకాంతం, యస్ వి. రంగారావు - సూర్యకాం-తం, గుమ్మడి - సూర్యకాంతం జంటలు తప్పనిసరిగా ఉండేవి.

[2:49 AM, 10/9/2023] Pod: నటనా పరంగా చూస్తే... సూ-ర్యకాంతాన్ని కేవలం గయ్యాళి అత్తగా కానీ, హాస్యనటిగా కానీ అనుకోవడానికి లేదు. ఆమె ప్రత్యేకంగా హాస్యం చేయక పోయినా.. ఆమె సంభాషణలు చెప్పే విధానం ఒక ప్రక్క నవ్వు తెప్పిస్తే, చేసే చేష్టలు మరో పక్క కోపం

తెప్పిస్తాయి. అలా ఆమెను కేవలం హాస్యనటి అనీ అన లేము, దుష్ట పాత్రధారినీ అని అనలేం. గయ్యాళి అత్త అని కూడా అన లేం. ఆమె క్యారెక్టర్ ఆర్టిస్ట్... సహాయ నటి... ఏ పాత్ర ఇస్తే ఆ పాత్రలో ఒదిగి పోతుంది. ఏ పాత్ర లోనైనా ఆమె జీవించగ-లదు. ఆమె నటన, ఆమె నటించే పాత్రకు వన్నె తెస్తుంది. కానీ, గయ్యాళి అత్త పాత్ర ను ఆమె స్పెషలైజేషన్ చేసింది అనుకో-వాలి. ఆమె నటించిన చిత్రాల్లో, ఆ తరహా పాత్రలకు ఆమె జీవం పోసింది.

ఇక సూర్యకాంతం వ్యక్తిత్వం వి-షయానికి వస్తే అస్సలు గయ్యాళి కానే కాదు. మామూలు మనిషే. ఎంతో సరదాలు, హాస్య చతురత ఉన్న మనిషి. దయార్ద్రహృద-యం గల మనిషి. ఇతరులకు సహాయం చేసే మనిషి. కానీ, ఆమె చేసిన పాత్రల వల్ల కాబోలు ఏ సమావేశానికైనా, సినిమా ఉత్సవాలకైనా వెళ్లినప్పుడు. స్త్రీలు సైతం ఆమె వద్దకు ఆటోగ్రాఫ్‌ల కోసం

వెళ్లడానికి భయపడే వారట. నిజానికి ఆమె చాలా నికార్సయిన

మనిషి. ఖచ్చితమైన మనిషి. సహృదయం గల మనిషి. నలుగురికీ సహాయపడే మనిషి. దబాయింపు, కచ్చితత్వం ఉన్న మనిషే అయినా... మనసు మాత్రం వెన్నలా సున్నితం. సహాయపడే స్వభావం ఉన్నా, అవసరమైన వాళ్లకు ఆర్థికసహాయం చేసేది కానీ ... అనవసరం అనిపిస్తే మాత్రం పూచిక పుల్ల కూడా విదిలించేది కాదు.

ఆమె శుభ్రంగా తినేది. కడుపునిండా తినేది. పదిమందికీ పెట్టేది. షూటింగ్‌కి వచ్చినప్పుడు ఏవో తినుబండారాలు, స్నాక్స్ తీసుకురావడం అందరికీ పెట్టడం చేసేది. విశేష దినాలు, పండుగలు, పబ్బాలు వస్తే ఇక సరే సరి. ఇంక చెప్పనే అక్కరలేదు. ఇటువంటి అలవాటే తోటి నటీమణులైన సావిత్రి, కృష్ణ కుమారి, జానకీ లాంటి వారికి కూడా ఉండేది.

సూర్యకాంతం మొహమాట పడకుండా నిర్మాతల నుంచి తనకు రావాల్సిన పారితోషికాన్ని గట్టిగా అడిగి తీసుకునేది. ఆమెకు నటన అంటే ఎంత ప్రాణం అంటే, ఎంత ఇష్టమంటే... చివరి దశలో వేషాలు తగ్గిపోయినా... చివరి దాకా నటిస్తూనే ఉండాలి అని కోరుకునేది. తన ఆరోగ్యం బాగు లేకపోయినా నటిస్తాను అని ధైర్యంగా చెప్పేది. 1946లో ప్రారంభమైన ఆమె నటప్రస్థానం 1994 వరకు కూడా సాగింది. 1946 నుంచి 1994 వరకూ సాగిన 48 సంవత్సరాల నట జీవితం లో ఆమె మొత్తం 313 చిత్రాల్లో నటించడం జరిగింది.

ఆమె 1950 సంవత్సరంలో

శ్రీ పెద్దిభొట్ల చలపతిరావు గారిని వివాహం చేసుకున్నారు. తదనంతరం ఆయన హైకోర్టు జడ్జిగా పదవీ విరమణ చేశారు.

సూర్యకాంతం దంపతులకు సంతానం కలగకపోవడంతో, తన అక్కగారి కుమారుణ్ణి బాల్యంలోనే దత్తత తీసుకున్నారు. సూర్యకాంతం గారి కుమారుడు శ్రీ అనంత పద్మనాభ మూర్తి గారు, ప్రస్తుతం చెన్నై లో హోమియో ప్రొఫెసర్ గా పనిచేస్తూ, హోమియో డాక్టర్ గా ప్రజాసేవ చేస్తున్నారు.

సహజ నట కళా శిరోమణి, హాస్య నట శిరోమణి, బహుముఖ నటనా ప్రవీణ, రంగస్థల శిరోమణి --- అన్నవి ఆమెకు ప్రదానం చేసిన బిరుదులు. 1994 జూలై నెలలో తిరుపతి లోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వారు సూర్యకాంతానికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు.

28 అక్టోబర్ 1924 న జన్మించిన సూర్యకాంతం 18 డిసెంబర్ 1994 లో 70 ఏళ్ల వయసులో చెన్నై లో సహజ మరణం పొందారు.

ఏది ఏమైనా... సూర్యకాంతం అంటే ఒక ప్రభంజనం.

ఆమెలాంటి సహజనటి చలనచిత్ర సీమ లో మరొకరు లేరు, భవిషత్తులో కూడా జన్మించరు. ఆమె నటించిన పాత్రల్లో మరొకరిని ఊహించుకోలేము.

అంతటి గొప్ప నటి మన తెలుగు చలన చిత్ర సీమలో గొప్పగా నటించడం, వారి సినిమాలు చూసే భాగ్యం కలగడం, ఆమె శతాబ్ది సంవత్సరం లో, ఆమె పై ఈ వ్యాసం వ్రాయడం నేను చేసుకున్న అదృష్టంగా భావిస్తున్నాను.

ఈ వ్యాస రచనకు సహకరించిన వికీపీడియా కు కృతజ్ఞతలు.

కొసమెరుపు

శ్రీమతి సూర్యకాంతం పాల్గొన్న ఒక సభలో మహానటుడు శ్రీ గుమ్మడి ఇలా చెప్పారు..."నీ నటన తో, సూర్యకాంతం లాంటి చక్కటి పేరును ఏ ఆడపిల్లా పెట్టుకోడానికి భయపడేలా చేసావు కదా తల్లీ !" అంటూ నవ్వుతూ చెప్పారు. అది నిజమే కదా

# ఇకనైనా మారాలి



చివటం సుబ్బారావు

మహాత్ముని  మౌనం అణుబాంబు కంటే వేయిరెట్లు ఫలితానిచ్చింది
అందుకే ఆయన మహాత్ముడయ్యాడు
మనిషికి కావలసింది భయంకరమైన ఆకారం కాదు మనోధైర్యం ఉండాలి
అని రుజువు చేసింది ఆ బక్కచిక్కిన శరీరం

తన మౌనమే మారణాయుధం
ఫలితంగా స్వాతంత్ర్యాన్ని సంపాధించుకున్నాం
పల్లె స్వరాజ్యం కావాలి సామాన్యుడికి కూడా స్వాతంత్ర్యం రావాలి
అర్ధరాత్రి స్త్రీ ఒంటరిగా యింటికి చేరుకునే రోజు చూడాలి
అప్పుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు
ఇవి బాపూజీ కన్నకలలు



ఎక్కడుంది స్త్రీకి స్వేచ్ఛ?
మహాత్ముడు నడిచిన ఈ నేలపై
ఆడది ఒంటరిగా తిరిగేనా!?
రాముడు ఏలిన ఈ రాజ్యంలో రాబందుల స్వైర్యవిహారం ఆగేనా!
అడవి మృగాలు సైతం అణగారిపోతుంటే కొత్తగా మానవ మృగాలు
సమాజంలో చెలరేగి జింకపిల్లలను వేటాడి చంపేస్తున్నాయి
సహజమగు నీతి నియమాలు భూ స్థాపితమౌతున్నాయి

నీ స్వార్థం కోసం పవిత్రమైన ఈనేల  రక్తపు మరకలు కాకుండా
మరో మహాత్ముడు పుట్టాలి
ఒక చెంపను కొడితే మరో చెంపను చూపే మహాత్ములు రావాలి
కావాలి ఈ నా భారతదేశంలో...
అప్పుడే అర్ధరాత్రి స్త్రీ ఒంటరిగా తిరిగేను
అదే నిజమైన స్వాతంత్ర్యం

# కలలన్నీ..కల్లలేనా!

గుండాల మహాలక్ష్మీ



సర్వ మతాల సారమై మానవత్వానికి రూపమై
సమభావనయే ధ్యేయంగా  జాతి ఐక్యతయే లక్ష్యంగా
కులమతాలకు అతీతంగా ఆదర్శభావాలే పునీతంగా

సత్యాహింసల ఆయుధమై
ఆచరణాత్మక భూషణమై నిలిచెను ఇలలో
అఖండ శక్తి సాధనం అదే మన "గాంధేయం"

ఉద్యమానికి ఊపిరి పోసిన ఉప్పు సత్యాగ్రహంతో  మొదలై
మానసిక వికాస మణిద్వీప ప్రకాశమై
భావితరాలకు స్ఫూర్తి దాయకంగా వెలుగొందు
మన మహాత్ముని జ్ఞాన ప్రభోదం

సంపన్నులు సైతం ప్రజా సంక్షేమమే మాధ్యేయమంటూ
సేవే మా మతమంటూ సాగింది గాంధేయం
ఖద్దర్ ఉద్యమంతో ఖబడ్దార్ అంటూ
విదేశీ వస్తువులను బహిష్కరించింది

బక్కచిక్కిన నేతన్నల కడుపు  నింపింది
గుడిసెలో చుట్టబడే చేనేతరాట్నమే
సనాతన ధర్మమై  గాంధేయ రథచక్రమై
గిరగిరా తిరిగింది  భారతావనియంతా....

స్వార్ధపరత్వ మెరుగని ఆప్యాయతానురాగం
మామూలు మనిషినే మహాత్ముని చేసింది
ఆ నిరాడంబరం లోనే వుంది అసలైన నిండుదనం
అందుకే జాతి నిర్మాణకర్త అయ్యాడు  "మనజాతి పిత"

నేటి సమాజంలో కనుమరుగవుతున్న నైతికత
ఆ మహాత్ముడి కన్న కలలు కాపాడుకోవడం ఇకపై మనందరి
బాధ్యత

...... 0 .....

గుండాల మహాలక్ష్మీ
ములపర్రు

# బ్రహ్మఖండం

డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ



వేదవ్యాస మహర్షి రచించిన అష్టాదశ పురాణాలలో స్కాంద పురాణం ఒకటి. ఎనభైఎనిమిది వేల ఒక వంద శ్లోకములతో కూడిన ఈ పురాణం పురాణాలలోకెల్లా అతి పెద్దది.

ఈ పురాణం మహేశ్వర, వైష్ణవ, బ్రహ్మ, కాశీ, అవంత్య, నగర మరియు ప్రభాస అనే ఏడు (7) ఖండాలుగా విభజింపబడింది. అందులో మూడవ భాగమైన 'బ్రహ్మ ఖండం' మూడు ఉపఖండాలుగా విభజింపబడింది.

ఇదివరలో మన చైతన్యం సంకల్పబలం పత్రికా పాఠకులకు 'కాశీ ఖండం' అందించిన ప్రముఖ రచయిత శ్రీ పోచనపెద్ది వేంకట మురళీకృష్ణ గారు ఇప్పుడు 'బ్రహ్మఖండం' సమర్పిస్తున్నారు.

పాఠకులు ఈ పురాణ పఠన సదవకాశాన్ని వినియోగించుకుని ఆ పరమేశ్వరుని కృపకు పాత్రులు కాగలరని ఆశిస్తున్నాము.

-ఎడిటర్

## 2. వ. అధ్యాయం

### సేతు నిర్మాణం

రాముడు చక్ర తీర్థంలో వానరులుతో సమావేశమయి " ఈ సముద్రం దాటడానికి తగిన ఉపాయం చెప్పమని " అందరిని అడిగాడు.

" పడవలలో, నావలలో సముద్రాన్ని దాటుదాము" అని సుగ్రీవుడు మొదలయిన వానరులు రామునికి విన్నవించారు. " రాఘవుడు సముద్రుని శరణు కోరిన ట్లయిన మనయెడల సముద్రుడు కరుణిస్తాడు. ఈ సముద్రాన్ని రాముని పూర్వీకులైన సగరులు తవ్వారు.అందువలన సముద్రుడు తప్పకుండా సాయం చేస్తాడు" అని విభీషణుడు పలికాడు. రాముడు వానరులను ఓదారుస్తూ "వందయోజనాల విస్తీర్ణంలో ఉన్న ఈ సముద్రాన్ని మన సైన్యాన్ని తెప్పల మీద, బల్లకట్టుమీద దాటలేరు. విభీషణుడు చెప్పినది నాకు అంగీకార్యమైయింది. మార్గం ఏర్పడడానికి సముద్రుని ఉపాసిస్తాను. సముద్రుడు మనకు మార్గం ఇచ్చినా సరే లేని పక్షంలో అగ్ని, వాయు బాణాలతో సముద్రుని ఛేదిస్తాను" అని రాముడు ప్రతిజ్ఞ చేసాడు. ఆ సముద్ర తీరంలోనే దర్భాసనంపై కూర్చుని సముద్రుని ఉపాసించాడు. తన కుడి చేతిని తలగడాగా పెట్టుకొని పడుకొనే వాడు. ఈ విధంగా కఠిన నియమాలు పాటిస్తూ మూడురోజులు రాముడు సముద్రుని ఉపాసించాడు. సముద్రుడు కనికరించ లేదు. శ్రీ రామునికి కోపంతో కళ్ళు ఎర్రపడ్డాయి. " ఓ లక్ష్మణా! నా ధనుస్సు బాణాలు పట్టుకొని రా! ఈ సముద్రాన్ని ఎండకడతాను. వానరులు నడిచి వెడతారు. మర్యాద అతిక్రమించిన ఈ సముద్రుడికి మర్యాద లేకుండా చేస్తాను" అని కోపంతో అగ్ని వంటి బాణాన్ని విడిచి పెట్టాడు. ఆ బాణాలు దిక్కులను వెలిగింప చేస్తూ సముద్రంలో ప్రవేశించాయి. సముద్రుడు భయపడి, బ్రాహ్మణ రూపంలో వచ్చి,రాముడిని శరణు వేడాడు.

సముద్రుడు రాముని ప్రార్ధించుట--------------------

**నమామి తే రాఘవ పాదపంకజం**

**సీతాపతే సౌఖ్యద పాద సేవనాత్**

**నమామి తే గౌతమ దారమోక్షజం**

**శ్రీ పాదరేణుం సురవృంద సేవ్యం**

**సుంద ప్రియా దేహ విదారిణే నమో**

**నమోస్తు తే కౌశిక యాగ రక్షిణే**

**నమో నమో మహాదేవ శరాసభేదినే**

**నమో నమో రాక్షస సంఘ నాశినే**

**రామ రామ నమస్యామి బక్తానామిష్ట దాయినం**

**అవతీర్ణో రఘుకులే దేవ కార్య చికీర్షయా**

**నారాయణ మనాద్యంతం మోక్షదం శివమచ్యుతం**

**రామ రామ మహా బాహో రక్షమాం శరణాగతం**

**కోపం సంహార రాజేంద్ర క్షమస్వ కరుణాలయ** (75-78)

"ఓ రాఘవా! పద్మమముల వంటి నీ పాదాలకు నమస్కరిస్తున్నాను. నీ పాదసేవన సౌఖ్యాన్ని ఇస్తాయి. అహల్యకు మోక్షాన్ని ఇచ్చావు. నీ పాద ధూళికి నమస్కరిస్తాను. విశ్వా మిత్ర యాగం రక్షించావు, శివ ధనస్సు విరిచావు, రాక్షసులను సంహరించావు, భక్తుల కోరిక తీర్చావు, దేవ కార్యాన్ని నెరవేర్చడానికి రఘుకులంలో జన్మించావు. నారాయణుడవు, ఆద్యంత రహితుడవు, మోక్షప్రదుడవు, మంగళ కరుడవు, నాశ రహితుడవు, శరణాగతుడవైన నన్ను అనుగ్రహించు. ఓ దయామయా! నన్ను రక్షించు. రామా! నేను(సముద్రం) లోతుగా ఉండడం సహజ ధర్మం. నా సహజ ధర్మాన్ని ఎలా విడిచి పెడతాను. అయినా నీవు సముద్రాన్ని దాటడానికి సహాయ పడతాను." అని సముద్రుడు రాముని ప్రార్థించాడు. "రావణుని సంహరించడానికి లంకా నగరం సైనికులు వెళ్ళాలి .మేము వెళ్ళే వరకు నీవు ఎండిపోయి ఉండాలి " అని రాముడు సముద్రుని ఆదేశించాడు. "రామా! నీ ఆజ్ఞ ప్రకారం ఎండిపోయినట్లయిన ఇతరులుకూడా ఈ విధంగానే అడుగుతారు. నీ సైన్యం లో ఉన్న నలుడు అను వాడు విశ్వకర్మ కుమారుడు. అతనిని కర్ర, గడ్డి, రాయి, నాలో వేయమను. నేను వాటిని భరిస్తాను. సేతువు ఏర్పడుతుంది. ఆ సేతువుపై లంకా నగరం వెళ్ళు." అని చెప్పి సముద్రుడు అంతర్థానమయ్యాడు.

రాముడు నలుని పిలిచి "సముద్రంపై సేతువును నిర్మించు" అని ఆజ్ఞాపించాడు. "మహారాజా! మా తండ్రిగారి వర ప్రభావం వలన సేతువును నిర్మిస్తాను. నేను విశ్వకర్మతో సమానమైన వాడను. ఈ రోజే వానరుల సహాయంతో సేతువు నిర్మాణం ప్రారంభిస్తాను" అని నలుడు విన్నవించాడు. రాముడు ఆజ్ఞాపించగా వానరులు పర్వతాలు, చెట్లు, లతలు, గడ్డిమొదలయినవి తీసుకు వచ్చారు. నలుడు సేతువు నిర్మించాడు.పది యోజనాల విస్తీర్ణం, పదియోజనాల పొడవు గల సేతు నిర్మాణం పూర్తయింది.

ఈ సేతువును దర్శించిన మానవులు పాప విముక్తులవుతారు.ఇక్కడ స్నానం చేస్తే, శివుడు ఆనందిస్తాడు. సేతు స్నానంతో సమానమైనది మరొకటి లేదు.సేతువు నిర్మాణం ప్రారంభించిన ప్రాంతమును "దర్భ శయనము" అని లోకంలో ప్రశిద్ధి పొందింది. ఇక్కడ అనేక పుణ్య తీర్థాలు ఉన్నాయి. వాటిలో ఇరవై నాలుగు తీర్థాలు మాత్రం ప్రశిద్ధమైనవి. చక్ర తీర్థం, బేతాళ, వరద తీర్థం, పాప వినాశనం, సీతా సరస్సు, మంగళ తీర్థం, సకల పాపఘ్నీ తీర్థం,అమృత వాపిక, బ్రహ్మ కుండం, హనుమత్కుండం,అగస్త్య తీర్థం, రామ తీర్థం, లక్ష్మణ తీర్థం, జటా తీర్థం, లక్ష్మీ తీర్థం,అగ్ని తీర్థం, చక్రతీర్థం, శివ తీర్థం, శంఖ తీర్థం, యమున తీర్థం, గంగా తీర్థం, గయాతీర్థం, కోటి తీర్థం, సాధ్య తీర్థం, మానవ తీర్థం, ధనుష్కోటి. అనునవి పుణ్య ప్రదమైనవి, పాప నాశకమైనవి.

ఈ వృత్తాంతాన్ని చదివిన వారు, వినిన వారు ముక్తులవుతారు. జయమును పొందుతారు. పునర్జన్మ ఉండదు.

స్కాందపురాణం లోని, బ్రహ్మ ఖండములోని సేతు మాహాత్మ్యంలో " సేతు నిర్మాణం " అను రెండవ అధ్యాయం సమాప్తం.

(సశేషం)

# సంభాషణ సంస్కృతం



డాక్టర్ . చిలకమర్తి దుర్గాప్రసాద రావు

## Lesson-9

**Unit-2**

अपि (అపి) = **మరియు also**

अपि **అనే పదానికి చాల అర్థాలున్నాయి. ముఖ్యమైనవి కొన్ని పరిశీలిద్దాం .**

**1. అపి అనే పదం ముందు ఉపయోగిస్తే అది ప్రశ్న ఔతుంది .** अपि क्रियार्थं सुलभं समित्कुशम् **? (Kalidasa) అంటాడు కాళిదాసు . ఓ పార్వతి! ఇక్కడ హోమం మొదలగు క్రియాకలాపములకు సమిధలు దర్భలు సులభంగా దొరుకుతున్నాయా ? అని ఆ మాటలకర్థం**

अपि भवान् संस्कृते वक्तुं शक्नोति? =**నీవు సంస్కృతంలో మాట్లాడగలవా? Can you speak in Sanskrit?**

**2.** अपि= **ఐనప్పటికి (Despite)**

अपि स्वर्णमयी लङ्का न मे लक्ष्मण रोचते |

जननी जन्मभूमिश्च स्वर्गादपि गरीयसी ||

**ఓ లక్ష్మణా! ఈ లంకా రాజ్యం బంగారం వంటిదే ఐనప్పటికీ నేనిక్కడ ఉండడానికి ఇష్ట పడను ఎందుకంటే కన్నతల్లి , ఉన్నఊరు స్వర్గం కన్నా గొప్పవి .**

**3.** अपि = **also / too.**

स: संस्कृतं जानाति प्राकृतम् अपि जानाति = **స: సంస్కృతం జానాతి ప్రాకృతం అపి జానాతి . He knows Sanskrit. He knows Prakrit too / also.**

मोहन: न केवलं गृहकार्यं करोति स: उद्योगम् अपि करोति|

**మోహన: న కేవలం గృహకార్యం కరోతి ఉద్యోగం అపి కరోతి =**

**Mohan not only does the house hold duty, but also works in the office.**

राम: वनं गतवान् सीता अपि गतवती |=**రామ: వనం గతవాన్ సీతా అపి గతవతీ Rama went to forest. Sita also went.**

स: न केवलं पठति लिखत्यपि | = **అతడు చదవడమే కాదు వ్రాయగలడు కూడ. He not only writes but also speaks.**

**అపి అనే పదం ఉపయోగించి అన్ని అర్థాలలోను కొన్ని వాక్యాలు తయారు చెయ్యండి .**

**(సశేషం)**

# శ్మశ్రుకేశులు ఆకా గడ్డం-బూచోళ్ళు

ఎలెక్ట్రాన్



వేసవి శలవుల్లోనే కేశంపాడు ప్రభుత్వ కళాశాలనుంచి బదిలీ అయి, కుంతలపాడు ప్రభుత్వ కళాశాల ప్రధానోపన్యాసకురాలిగా సుశీల విధులు చేబట్టింది. పాలనా విభాగంలోని నరసింహం చేత ఉపన్యాసకులందరికీ కాలేజీ తెరిచే ముందురోజు పది గంటలకల్లా వచ్చి కలుసుకోమని కబురు పంపింది.ఇద్దరు మగ ఉపన్యాసకులు తప్ప అందరూ ఊరిలోనే ఉన్నారనీ, ఆ యిద్దరూ కూడా ఆసాయంత్రానికి ఊరు చేరతారని కబురందించాడు. ఆ రోజు సుశీల తొమ్మిదింటికే తన కుర్చీలో కూర్చుని, డెస్క్ టాప్ కంప్యూటర్లో ఉపన్యాసకుల జాబితా, ముఖచిత్రాలు, సూక్ష్మవివరాలూ చూడసాగింది. అలా చూడ్డంలో సమయం పదికి చేరింది. వేసిన కుర్చీలన్నీ ఖాళీగానే ఉన్నాయి. నరసింహాన్ని పిలిచి "ఇదేమి వ్యవహారం?" అని చికాగ్గా అడిగింది.

"ఈ రోజు ఆదివారమమ్మా. ఈ కాలేజీలో ఉపన్యాసకులందరూ నియమపాలనలో అరంగుళం కూడా కదలరు. అందులోనూ వేసవి సెలవుల ఆఖరి రోజు కదమ్మా?"

"సంగతి నాకు ముందే తెలియజేసుండాల్సింది. అయినా నాదే బుద్ధిపొరపాటు!"

"ఉపన్యాసకులందరూ నియమపాలనలో ఆజ్ఞాధిక్కారం కూడా చేస్తారన్నవిషయం మీకుతెలుస్తుందనే నోరు మూసుకొన్నానమ్మా!"

సోమవారం ఉదయం ఉపన్యాసకులందరూ పదిగంటలకి బిలబిలా లోనికొచ్చి, కొత్తావిడకి నమస్కారంచేసి, కుర్చీలనన్నింటినీ క్రితంరోజునే తీయించేసిన మూలాన చేసేదిలేక నిల్చున్నారు. సుశీల ముందున్న కంప్యూటర్ నుంచి దృష్టి మళ్లించి తనముందు ఇరవైమంది మగాళ్లనీ, వెనకనే నక్కి నిల్చున్న ఓ పదిమంది స్త్రీలనీ చూసింది. "నరసింహంగారూ, ఈ గడ్డపాళ్లందరూ ఎవరు? లోపలికెలావచ్చారు, బయటకి తోలేయండి!" అని అరిచింది.

"సారీ మేడమ్ గారూ! వీళ్ళందరూ ఉపన్యాసకులు. నిన్నమీరు పిల్చిన సమావేశానికి రాలేనందుకు ఇవ్వాళ వచ్చారు!" అన్నాడు నరసింహం.

"వెనక నిల్చున్నస్త్రీ ఉపన్యాసకులలో ఎవరో ఒకామె మాత్రం చీరలో కనిపిస్తున్నారు. వారు ముందుకు రండి," అంది సుశీల. సదరు మహిళ ముందుకు వచ్చింది. మనిషి నిండుగా, ఆకర్షణీయంగా సెంటు వాసనలతో ఘుమఘుమలాడిపోతోంది. "పరిచయం చేసుకోండి, మరి,"అంది సుశీల.

"నేనాండీ, కుటహారిక నండి."

"మీరే క్లాసులు తీసుకొంటారు?" సుశీల అడిగింది.

"ఆఫీసు గదులన్నీ తుడుస్తానండి"

"మరి వరండాలనీ, క్లాసు గదుల్నీ, ప్రయోగశాలల్నీ ఎవరు తుడుస్తారట?"

"కొండశాస్త్రీ, బండశర్మా తుడుస్తారండి. వెనక నుంచున్నారండి. ముందుకు రమ్మని చెప్పమన్నారా?"

సుశీలవేరే ఆజ్ఞాపించకుండానే వాళ్ళిద్దరూ ముందుకు వచ్చారు.

"ఇంకా, ఉపన్యాసకులు కానివారెవరో ముందుకు రండి." మరో ముగ్గురు ముందు కొచ్చారు.



"మేము ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ లేబొరెటరీల అటెండర్లమండి," అన్నారు వారిలో ఒకరు.

"మీ ఆరుగురూ వేరుగా ఈపక్కన నిల్చోండి. ఈ కాలేజీలో నాతో సహా మొత్తం ముప్పైఆరుమంది ఉపన్యాసకులు. ఇరవైఅయిదుగురు పురుషులు. నాతో సహా పదకొండుగురు స్త్రీలు. నిన్న పిలిచినా ఎవరూ రాక, యివ్వాళ పిలవకపోయినా ఇక్కడకు వచ్చిన వారిలో నాకు పదిహేను గడ్డం శాల్తీలు, నాతో కలిపి పది స్త్రీ శాల్తీలు లెక్కకొస్తున్నాయి. అంటే సెలవుల తర్వాత ఒక ఉపన్యాసకురాలూ, పదిమంది ఉపన్యాసకులూ విధి నిర్వహణకు రాలేదన్నమాట!"

"అలాగని కాదమ్మా, కొంతమంది తమ క్లాసు ఉన్నప్పుడే కాలేజీకి వస్తారు. అంచేత సాయంత్రానికి కానీ లెక్క తేలదండి. రెండో క్లాసు లేకపోతే కొందరు వెంటనే వెళ్లిపోతారండి."

"కుటహారికా, నీ పేరు ప్రియంవదని కంప్యూటర్ చేబ్తోంది. కుటహారికన్నపేరు నీకెవరు పెట్టారు?"

ప్రియంవద వణుకుతూన్న కంఠంతో అంది "ఆ మూల జీన్స్ ప్యాంటూ, తెల్ల జుబ్బా, నీలం కోటు వేసుకొన్న తెలుగు పంతులమ్మ కనకవల్లిగారు పెట్టారండి."

దీని దుంప తెగా అనుకొంటూ కనకవల్లి ముందుకొచ్చింది. సుశీల జీన్స్ లో ఉన్న ఆమెను ఎగాదిగా చూసి, "ఉపన్యాసకురాలిగా ధరించవలసిన వస్త్ర సంప్రదాయం కాదనుకొంటాను. విద్యార్థులకు శిక్షితురాలిగా కాక వారి ఏకాగ్రతను భంగపరిచే తీరులో ఉంది మీ వస్త్రధారణ! ఇప్పుడు మీదే పీరియడ్, ఎవరి క్లాసు?"

"ఇంటర్ రెండో సంవత్సరం ఏ సెక్షన్ వాళ్ళకి మొదటి పిరియెడండి."

"మీరందరూ పిలవని పేరంటానికొచ్చారు. ఇప్పటికే పది క్లాసునిముషాలు వ్యర్థం చేశారు, పోయి మీ క్లాసులు తీసుకోండి. సాయంత్రం ఆఖరి గంటవగానే అందరూ ఇక్కడికి రండి."

ఈవిడ సుశీల కాదు, సూరేకాంతం అనుకొంటూ అందరూ బయటకి పోయారు.



తర్వాత సుశీల నరసింహాన్ని వెంట తీసుకువెళ్లింది. ప్రతి క్లాసులోనూ మీసగడ్డాలు పెంచిన విద్యార్థులే. తన స్మార్ట్ ఫోన్లో చూసి "రూమ్ నెంబరు రెండువందల రెండుకి పదండి," అంది.

వచ్చినావిడ ఎవరో తెలియక విద్యార్థులు లేవలేదు. అందరికీ ఆరంగుళం మందాన గడ్డాలున్నాయి. అప్పటికేదో పాఠం చెప్పడానికి సిద్ధపడ్తోన్న కనకవల్లి లేచి నిల్చుంది.

సుశీల బల్లమీదనున్న అటెండెన్స్ రిజిస్టర్ చూసి, తలెత్తి క్లాసువైపు చూసి "రిజిస్టరులో నలభై పేర్లు. క్లాసులో ఉన్నది నలభై ఇద్దరు! గమనించారా కె.వల్లిగారూ?" అంది.

కనకవల్లి బిత్తరపోయింది. వచ్చినావిడ ప్రిన్సిపాల్ అని విద్యార్థులు గ్రహించారు.

"గడ్డం విద్యార్థులూ, విన్నారుగా? అదనంగా ఉన్న విద్యార్థులెవరో మీకే తెలియాలి. వాళ్లెవరో చెప్పండి, లేకపోతే క్లాసునంతటినీ వారం రోజులు బహిష్కరిస్తాను. రోల్ కాల్ చేస్తే సులువుగా దొరికిపోతారు."

ఒకవిద్యార్థి లేచి,"అందరం కాలానుగుణంగా లవర్ బాయ్స్ గెడ్డాలు పెంచేశాం మేడమ్! నిన్నటివరకూ పక్కన కూర్చున్నవాణ్ణి ఈ రోజు గుర్తు పట్టలేకుండా పోతున్నాం!'" అన్నాడు.

"కొత్తగా వచ్చానుకదాని నాతో ఆటలాడుతున్నారా?! జాగ్రత్తగా ఉండండి. లేకపోతే కృతిఖల్లాన్ని వలిచేస్తాను!"అంది.

"కృతిఖల్లమ్ అంటే ఏమిటి మేడమ్?" ఎవరో అడిగారు కాస్త ధైర్యం చేసి.

"మీ తెలుగు మేడమ్ ని అడగండి!" అంటూ కనకవల్లి వైపు చూస్తూ అంది.

"చర్మం1"అంది కనకవల్లి అడిగిన వెంటనే అర్థం గుర్తుకు రావడంతో. 'ఫిజిక్స్ మనిషయ్యుండీ ఈవిడకింత తెలుగు వచ్చునా?' అనుకొంది కనకవల్లి.

"సరిహద్దులు దాటి వందమంది తీవ్రవాదులు ఈ ఊళ్ళో తలదాచుకొన్నారని కబురందింది. భద్రతాదళాలు రేపట్నుంచీ అందరి గడ్డాలు గొరిగించి, తనిఖీ చేస్తారు. నరసింహంగారూ రోల్ కాల్ చేయండి!"

క్లాసు మధ్య బెంచిల్లో కూర్చున్న ఇద్దరు విద్యార్థులు లేచారు. వారిలో ఒకడు "మాది బి.సెక్షన్. కనకవల్లిగారి క్లాసంటే మాకు చాలా ఇష్టం.అంచేత అక్కడి క్లాసు బంకు కొట్టి ఇక్కడికొచ్చి కూర్చుంటాం!"అన్నాడు బెదురుతూ. .

"పాఠం బాగా చెబ్తుందనా?"

వెనక వరస కుర్రాళ్ళు ముక్తకంఠంతో అన్నారు. "కాదు, ఆవిడ బాగా ఆకర్షణీయంగా ఉంటారని!"

"ముందువరసల్లోని అమ్మాయిలూ, ఇది మీ ఉపన్యాసకురాలికే కాదు, మీకూ వర్తిస్తుంది! సరే, బి సెక్షన్ కుర్రాళ్ళిద్దరూ ముందుకు వచ్చి నాతో రండి," అంటూ సుశీల విసురుగా బయటకు నడిచింది. నరసింహం సుశీలని బి సెక్షన్ కు తీసుకు వెళ్ళాడు. కుర్రాళ్ళిద్దరూ భయపడుతూ అనుసరించారు. అక్కడో జీన్స్ అమ్మడు బోటనీ పాఠం చెబ్తోంది. సుశీల అటెండెన్స్ రిజిస్టర్ తీసి చూసింది. విద్యార్థులు నలభై. కళ్ళతో క్లాసులో ఉన్న విద్యార్థులను లెక్కబెట్టింది. ఉన్నవారు నలభై!

"లీలావతిగారూ! ఈ ఇద్దరు

కుర్రాళ్ళు ఇంటర్ బి సెక్షన్ వాళ్ళ మంటున్నారు. వెళ్ళి కనకవల్లి గారి క్లాసులో కూర్చున్నామం-టున్నారు. రిజిస్టర్ ప్రకారం ఈ సెక్షన్ లో ఉన్నది నలభై. ఇప్పుడు క్లాసులో ఉన్నది నలభై! అదెలా సాధ్యం? అంటే వీళ్ళిద్దరూ నకిలీ విద్యార్థులు కావొచ్చు. లేదా వీరి స్థానే ఎవరో మరిద్దరు వచ్చి మీ క్లాసులో అఘోరిస్తూ ఉండొచ్చు. చెప్పండి వీళ్ళిద్దరూ ఈ సెక్షన్ స్టూడెంట్లు అవునో కాదో?" సుశీల కటువుగా అడిగింది.

"సారీ, మేడమ్, ఇంటర్ బోటనీ మొదటి సంవత్సరంలో ఇదే వి-ద్యార్థులకు పాఠాలు చెప్పేదాన్ని. అప్పుడు నాకు అందరి మొహాలూ తెలుసు. ఈ సెలవుల్లో అందరూ గెడ్డా లు పెంచేశారు. ఆనవాలు కట్టడం కష్టం1" అంది లీలావతి.

"యిక్కడ క్లాసు బంకు కొట్టి తెలుగు మేడమ్ పాఠం చేబ్తో-న్నగదిలోకి చొచ్చుకొని వెళ్ళిన ఈ శుంఠలిద్దరూ ఎవరో ఈ సెక్షన్ కుర్రాళ్ళే చెప్పాలి. లేకపోతే అందరి కాండక్ట్ సర్టిఫికేట్లలో, కిర్రి పెట్టేస్తాను. ఊఁ కమాన్ టెల్ మీ!" సుశీల కోపంగా అరిచింది.

"వాళ్ళిద్దరూ ఈ సెక్షన్ వాళ్లే-నండి, మేడమ్! ఆ పొడుగతను ప్రణవ్, ఒకంగుళం పొట్టిగా ఉన్న-తను ప్రేమకుమార్. ఈ ఇద్దరూ మా విద్యార్థినులమీద అసహ్యక-రమైన విసుర్లు విసురుతారండి!" ముందువరసలో కూర్చున్న ఓ అమ్మాయి లేచినిల్చుని చెప్పింది.

"మీ వస్త్రధారణచూసి ఏమైనా అంటారు, లేక ఏదో ఒకనాడు అఘాయిత్యం కూడా చేస్తే అప్పుడు ఏడుద్దురుగాని! మరి ఈ క్లాసులో ఇద్దరు ఎగస్ట్రాలు తగ-లడ్డారు. వాళ్ళిద్దరూ స్వయంగా లేచి నిల్చుని సంజాయిషీ ఇచ్చు-కోకపోయినా, లేక ఈ క్లాసు వి-ద్యార్థులే తెలిసి చెప్పకపోయినా రెండు రోజులక్రితం ఈ ఊళ్ళో దిగిన భద్రతాదళం కమాం-డర్కి ఫోన్ చేస్తాను." సుశీల ఆగింది. ఎవరూ పలకలేదు. సెల్ తీసి, చిన్న మెసేజ్ పెట్టింది.

ఉన్నట్టుండి ఇద్దరు బక్కప-ల్చటి విద్యార్థులు గ్యాలరీ వనక బెంచీనుంచి ఒకరు, మధ్య బెంచిల్లోంచి ఒకరూ లేచారు. "క్షమించండి మేడమ్. మే-మిద్దరమూ గత సంవత్సరం బోటనీలో ఫైలయిన విద్యార్థు-లం. అందుకని వచ్చి ఈ క్లాసులో కూర్చున్నాం. బోటనీ మేడమ్ కనక రోల్ కాల్ కనక చేస్తే ప్రణవ్, ప్రేమకుమార్లకు ప్రాక్సీ చెప్పడా-నికి ఒప్పందం చేసుకొన్నాం. మా పేర్లు నవనీత్, రమేశ్ బాబు."

"ఉపన్యాసకుల అశ్రద్ధా, వి-ద్యార్థుల క్రమశిక్షణా రాహిత్యం ఇలాంటి దౌర్భాగ్యపు పరిస్థితు-లకు కారణమౌతున్నాయి. మీ నలుగురు విద్యార్థులూ నా ఛాంబర్స్ లోకి రండి. మీ గుర్తిం-పు-రికార్డుల పరంగా నిర్ధారణ కానిదే వదిలేది లేదు,"అం-టూ బయటకు దారి తీసింది. నరసింహం, ఆ నలుగురు వి-ద్యార్థులూ వెంబడించారు.

భద్రతాదళం అధికారి వచ్చాడు. టింగురంగా సెలూన్ కేశకళాకా-రుడు మల్లిక్ మనోహర వచ్చి ఆ నలుగురి విద్యార్థుల గెడ్డాల్ని గీకి పారేశాడు. ఆ నలుగురి విద్యా-ర్థుల తండ్రులూ వచ్చారు. వారి గుర్తింపు నిర్ధారణ అయిన తర్వాత సుశీల ప్రణవ్, ప్రేమకుమార్లను చాలా తీవ్రంగా హెచ్చరించింది. "పరీక్షలో తప్పి ఇలా క్లాసులో-కి వచ్చి అజ్ఞాతంగా కూర్చోవ-డం చాలా తప్పు. బోర్డు పరీక్షల్లో తప్పిన వారికి సాయంసమయా-ల్లో తిరిగి ఉచితశిక్షణ ఇప్పించే దిశలో నేను ప్రయత్నాలు చేస్తాను. ఫిజిక్స్, మేథమెటిక్స్ నేను చె-ప్పగలను. నన్ను అనుసరించే ఉపన్యాసకులు ఎవరో ఒకరు ముందుకు వస్తారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని శ్రద్ధగా చదు-వుకోండి," అని రమేశ్, నవనీత్ లను మందలించి వదిలింది.

ఆ మర్నాడు కాలేజీ- ఉప్పాడ, పెద్దాపురం, గుంటూరు, ఫత్తెబాద ఏలూరు ఇత్యాది నేత చీరలతో మెరిసిపోయింది. యవ్వనపు తొలి మెట్టులెక్కిన విద్యార్థుల బు-గ్గలపై సూర్యుడు తళతళ మెరవ సాగాడు. క్రితం రాత్రి ఊరిలో ఉన్నమెన్స్ సెలూనులన్నీ రాత్రి తెల్లవార్లూ కిటకిటలాడిపోయా-యన్న సంగతి వేరే చెప్పనక్కర్లేదు.

వెనుకబడిన సంప్రదాయ, సంస్కారాలు ఓ సెంటీ మీటరు ముందంజ వేసాయి. సుశీల-మ్మ కాదు, సూరేకాంతం అని చాపకింది నీరులా ఆమె ప్ర-సిద్ధి చెందిన మాట వాస్తవం.

# కృష్ణ లీలా విలాసం



కొత్త రామానందం

నమామి సచ్చిదానందం భక్తాన్ స్వాత్మ నికర్షకమ్।
కృష్ణం నవ ఘనశ్యామం భక్త పాపాది కర్షణమ్॥

'కృష్ణ' శబ్దానికి అర్థం పలు విధములుగా వివరిస్తూ ఈ చిన్న శ్లోకంలో స్తుతించారు మహర్షులు. దీనికి తాత్పర్యం 'సచ్చిదానంద' స్వరూపుడు, సర్వ జీవులను తన వైపు ఆకర్షించు స్వభావం కలవాడు, భక్తుల పాపాలను లాగి వేసేవాడు, అయిన కృష్ణునికి నమస్కారములు. కృష్ణ అనే పదానికి అపరితమైన ఆనందమని అర్థం.

కృష్ణ నామం ఎంతో మధురం. ఆ నామాన్ని స్మరించగానే 'నా మదిలో శతకోటి యమునా తరంగాలు ఉవ్వెత్తున లేస్తాయి, వేయి వేణువులు దశదిశల నుండి మధురాతి మధురంగా మ్రోగి అణువణువునా పులకింపజేస్తాయి' అని కృష్ణుడే సర్వస్వంగా భావించిన శ్రీ మద్వల్లభాచార్యులవారు 'మధురాదిపతే రఖిలం మధురం' అంటూ పరవశించిపోయారు. "శ్రీకృష్ణః శరణం మమ" అనే మంత్రాన్ని అనుచరులకు ప్రసాదించి పుష్టి మార్గంలో పయనింపజేసి తరించారు. సత్యయుగంలో ధ్యానం వల్ల, త్రేతా యుగంలో యజ్ఞాల వల్ల, ద్వాపర యుగంలో పూజలు, వ్రతాల వల్ల పొందే ఫలితాలన్నీ కలియుగంలో కేవలం నామస్మరణ వలన పొందుతారట. కలియుగ వాసులకు



ఇంతకన్నా కావలసినదేముం-ది? 'కృష్ణస్తు భగవాన్ స్వయం' ఆ కృష్ణ భగవాన్ నామాన్ని నిత్యం స్మరించినంత మాత్రాని-కే పదివేల యజ్ఞాలు, శతకోటి తీర్థ స్నానాలు చేసినంత పుణ్యం లభిస్తుంది. కృష్ణ నామ సంకీ-ర్తనం జరిగే ప్రదేశంలో గయా, కాశీ పుష్కరక్షేత్రాలకున్న ప్రభావం ఉంటుంది. కృష్ణ నామస్మ-రణ చేసినవారి జీవనం ధన్యం.

'హరియను రెండక్షరము-లు, హరించును, పాతకముల నంభుజ నాభా హరి నీ నామ మహాత్యము హరిహర పొగడంగ వశమే హరి శ్రీకృష్ణా' అంటూ కృష్ణ నామ మహిమ కీర్తిం-చకుండా ఉండలేరు. చైతన్య మహాప్రభు, సూరదాసు, వల్ల-భాచార్యులు, మీరాబాయి మొదలగు వారు కృష్ణ నామామృ-తాన్ని గ్రోలి, తమ మనో నయ-నాలతో స్వామిని దర్శించి, తమ గానంతో అలరించి తరించారు.

కృష్ణుడు యశోద వాత్సల్యానికి వశుడై యశోదా కృష్ణుడయ్యాడు. దేవకీసుతుడై దేవకీ నందను-డయ్యాడు. వసుదేవుని పుత్రుడై వాసుదేవునిగా, గోవులను (ఇం-ద్రియాలను) పాలించి గోపాల-కృష్ణుడు, మురళిని మ్రోగించి మురళీకృష్ణుడు, గోపికల-ను అలరించి గోపీకృష్ణుడు, బృందావనంలో విహరించి బృందావన విహారి, ద్వారక-లో నివశించి ద్వారకా వాసుడు ఇలాంటి ఎన్నెన్నో నామాలను సొంతం చేసుకున్నాడు. జీవు-



లందరినీ తన నామ రూప లా-వణ్యాలతో మోహ పరవశులను చేశాడు ఆ మోహన కృష్ణుడు.

కృష్ణుడు బహువేషధారి. ఒక కొంటె బాలునిగా, శృంగార పు-రుషునిగా, ధీరోదాత్త నామకు-నిగా, మహాదౌత్య వేత్తగా, మహా సారథిగా, రణతంత్ర నిపుణినిగా, చివరికొక మహా శాంతి దూతగా ఆయన పాత్ర అమోఘం, అద్వి-తీయం. ఇలా 'కృష్ణ కథ' ఎన్నిం-టిలో ఉన్నా మనకు 'మహాభార-తమే' ప్రధానం. ఇక భారతంలోని 'హరివంశమ్' నిండా కృష్ణునిదే. శ్రీకృష్ణుడు లేక 'భారతానికి' గె-లుపెక్కడిది? అందుకే ఆయన చుట్టూ తిరిగింది మహాభారతం. వ్యాస మహర్షియే ఈ మహాభారత రచయిత.

శిక్ష రక్షణకు, దుష్ట శిక్షణ-కు ప్రతి యుగంలో భగవాను-డే అవతరిస్తూనే ఉంటాడు. తన లోకం నుండి భూలోకా-నికి దిగివస్తాడు. భగవానుని అవతారాలు ముఖ్యంగా అం-శావతారాలు, కళావతారాలు ఆవేశావతారాలు అని మూడు రకాలుగా ఉంటాయి. అంశా-వతార పరంపరలో శ్రీరాముడు పరిపూర్ణవతారంగా కాగా, శ్రీకృ-ష్ణుడు పరిపూర్ణతమ అవతారం-గా చెబుతారు. శ్రీకృష్ణుని ధర్మం సనాతనం. భూదేవి కోరిక మేరకు శ్రీమన్నారాయణుడు స్వయంగా శ్రీకృష్ణునిగా అవతరించాడు. శ్రీకృష్ణుడు సకల మానవాభ్యు-న్నతి కోసం, సంస్కృతి పరిర-క్షణ కోసం తపించి, అందుకు కృషి చేసిన మహనీయుడు. స్వామి వారు అడుగడుగునా తన పరమేశ్వరత్వాన్ని, సర్వసాక్షి-త్వాన్ని, సర్వజ్ఞతను, సర్వకారణ-త్వాన్ని వెల్లడిరచాడు. అందుకే ఆయన జగద్గురువు అయ్యాడు.

శ్రీకృష్ణ జననం: శ్రావణ శుద్ధ అష్టమి తిథి రోహిణి నక్ష-త్ర అమృత ఘడియల్లో శ్రీకృష్ణ పరమాత్మ జన్మించాడని వ్యాస

భారతం చెబుతోంది. దేవకీదేవి, వసుదేవుల పుత్రుడుగా చెరసాలలో నీలమేఘవర్ణ శరీరంతో చతుర్భుజాలతో ఉదయించాడు. అందరికీ బంధనాలు విడిపించి ముక్తినిచ్చే దైవం బందిఖానాలో జన్మించాడు. శంఖ, చక్ర, గదా పద్మాలు ధరించిన చతుర్భుజాత్మక నారాయణరూపంతో దేవకీ వసుదేవులకు దర్శనమిచ్చిన తరువాత పాకృత శిశువుగా మారిపోయాడు. ఆ తర్వాత అష్టమ గర్భంతో జన్మించిన శ్రీహరిని వసుదేవుడు నందుని రెండో భార్య యశోద అక్కున చేరుస్తాడు. ఆమె స్తన్యాన్ని గ్రోలి, తన లీలలతో ఆనందింపజేశాడు. యశోద తనయునిగా పెరుగుతూ శ్రీకృష్ణుడు తన బాల్యంలో చేసిన పనులు అందరినీ విస్మయపరిచే లీలలు ఆహ్లాదంగా ఉంటాయి. ఆ చిలిపి చేష్టలు, ఆ నవనీత చోరత్వం, గోప బాలలతో ఆటపాటలు మహదానందంగా కొనసాగుతాయి. ఆ పరమ పురుషుడు ద్వాపర యుగంలో బాలుకుడై అమ్మ అయిన యశోదకు ఆనందం కలిగించాడు. తల్లి యశోదను తన అల్లరి చేష్టలతో ఆటలు పట్టించేవాడు. వాసుదేవుడు లక్ష్మీదేవి కౌగిలికి చిక్కలేదు. సనకసనంద నాథులైన మహాయోగులు హృదయాలలో చిక్కలేదు. అలాంటి కృష్ణుడు లీలగా అవలీలగా చేతికి చిక్కి రోటికి కట్టి వేయబడ్డాడు. కృష్ణ స్వామి ఆమెకు పూర్తిగా వశమై సొంత బిడ్డే అయ్యాడు. అయినా



భక్తుల బంధనాల్లో ఉండడం ఇష్టపడేవాడు. ఏం భావించి తన వాడకున్న సరే అదే భావంతో వారి వాడవుతాడు భగవంతుడు. తామతిని సతులనుకున్నవారికి పతిగాను, అతనే గతి యనుకున్నవారికి మోక్షదాత గాను, ఎలా భావిస్తే అలా చేరువవుతాడు.

శ్రీకృష్ణ స్వామి బాల్య లీలలు: శిశువుగా ఉన్నప్పుడే పూతనను సంహరించాడు. పూతన అనేది ఒక రాక్షస స్త్రీ. కంసుడు పంపగా వచ్చి కృష్ణుని ప్రాణాలు తీయాలని ఉద్దేశంతో పాలిచ్చింది. తల్లిగా వచ్చిన పూతనను స్వామి పూర్తిగా తనదిగా చేసుకున్నాడు. అనగా మోక్షమిచ్చాడు.

కృష్ణయ్య ఏడవ యేట ప్రతి సంవత్సరం జరిపే ఇంద్ర పూజను ఆపు చేయించాడు. కనపడని దేవతలకెందుకు పూజ? కనిపించే దేవతలను పూజించండి అన్నాడు. గోవర్ధన పర్వతాన్ని పూజించమన్నాడు. ఇంద్రుడికి కోపం వచ్చింది. అతడు వర్షం కురిపించాడు. బాలకృష్ణుడు గోకులంలోని యావత్తు ప్రజానీకాన్ని, గోవులు వగైరా మూగజీవుల్ని రక్షించదలచి గోవర్ధనగిరిని చిటికెన వ్రేలుతో ఎత్తి అందరికీ రక్షణ చేకూర్చాడు. కృష్ణ స్వామికి ఇంద్రుని కన్నా గోవులు గొప్పవిగా, గోపాలురు గొప్పవాడిగా కనిపించారు. అదొక లీల. ముద్దుల కృష్ణుడు తప్పటడుగులు వేయడం మొదలుపెట్టినప్పట్నుంచి అల్లరి చేయడం మొదలుపెట్టాడు. పిల్లలందరితో కలిసి ఆడుకుంటున్నప్పుడు, కొంటె పనులు చేయడంలో బాలకృష్ణుడే ముందుండేవాడు. గోపికలు ఇంట్లో లేని సమయాన్ని చూసి ఉట్లపై వుంచిన పాలంతా తాగి, వెన్నంతా తినేస్తుండేవాడు. ఒకవేళ ఉట్టి అందకపోతే పీటలపై పీటలు పేర్చి లేకపోతే పిల్లలందరినీ ఒకరిపై ఒకరిని నిలబెట్టి ఉట్లలోని పాలు,

పెరుగు, వెన్నలను జుర్రుకుంటే వాడు. అలా కుదరనప్పుడు రాళ్లతో, కర్రలతో పాలకుండలను రంధ్రాలు చేసి వాటిలో నుంచి కారుతున్న పాలను, పెరుగును జుర్రుకుంటుండేవాడు. గోపికలు బాలకృష్ణుని పట్టుకుని యశోదమ్మ దగ్గరకు తీసుకెళ్లి న్యాయం అడుగుదామనుకుని అల్లరి కృష్ణుని పట్టుకునేందుకు రకరకాల ప్రయత్నాలు చేసేవారు. కానీ ప్రతిసారి వాళ్ల ప్రయత్నాలన్నీ విఫలమవుతుండేవి. 'రండహో జనులారి చల్దిగుడవన్ రమ్యస్థలి బొక్కటిదిదండన్' అంటూ తోటి పిల్లలతో చల్దులారగించిన సందర్భం గురించి చదివితే, ఆ గుంపులో మనమూ ఉన్నామనిపించక మానదు.కళ్ళు మూసుకుని ఊహించటమొకటే ఆలస్యం.



నంద వ్రజంలో గోపి గోపకులకు శిశువుగా, గోపబాలలకు సఖునిగా, గోపకన్యలకు కాంతునిగా తన కృపా మాధురిని ప్రసరించాడు. యశోద ఆ పరమాత్మని లాలనలో బ్రహ్మానందాన్ని చవి చూసింది. మట్టి తిని తల్లి యశోదకు నోటిలో విశ్వాన్ని చూపించాడు. తాను తల్లికే బంధుతుడై నల కుబేర మణిగ్రీవుల శాప బంధనాన్ని విడిపించిన పరమాత్ముని దామోదర లీల దివ్యాతి దివ్యం.

రాసలీల` రాధాకృష్ణులు: సృష్టిలో ఏ ఆకర్షణ ఉన్నా అందులో శ్రీకృష్ణుడు ఉన్నాడని రాధ భావిస్తుంది. అందుకు సంబంధించినంత వరకు సృష్టి మొత్తం కృష్ణుడితో నిండిపోయింది. గోలోకంలో నిత్యం శ్రీకృష్ణుడు రాధా సమేతుడై కొలువుంటాడు.ఆ గోలోకం వైకుంఠాధి నిత్య లోకాల వలనే ఉంటుంది. పర బ్రహ్మశక్తే ఆదిశక్తి. ఆ ఆదిశక్తే ప్రకృతి. పార్వతీ పరమేశ్వరులాగా రాధాకృష్ణులు ఉపాస్యమూర్తులు. రాధాదేవి రాసలీలకు అదిదేవత. మన నుండి భగవంతుని వైపు ప్రసరించేది భక్తి ధార అయితే, భగవంతుని నుండి మన వైపునకు ప్రసరించేది కృపాధార. ఆ కృపాధారే రాధగా సాక్షాత్కరిస్తుంది.

ఒక్కో గోపికకు ఒక్కో కృష్ణుడై అందరినందునూ తానూంటూ ఏర్పడ్డ మండలంలో తానొక్కడే వేణువు ఊదుతూ కృష్ణుడు ఉన్నాడు. అన్ని వైపులా ఉంటూనే దేనికీ అంటని యోగేశ్వరత్వానికి చిహ్నం. శ్రీకృష్ణుని వేణుగానంతో ఉన్నపాటున గోపికలు బృందావనానికి రావడం, కృష్ణునితో సంభాషణ అనంతరం స్వామి అంతర్ధానం, గోపికలు కృష్ణవియోగంతో విలపించడం కృష్ణ భావనలో తామే కృష్ణులు అయినట్లు ఆ లీలలను అభినయించడం, ఆర్తితో కృష్ణ గానం చేయడం,

కృష్ణ సాక్షాత్కారం, 'రాస పంచాధ్యాయి'లో కథలు రాసలీల పఠించినా, విన్నా 'కామ జయం' కలుగుతుందని భాగవతం చెబుతుంది. నందనవనంలో స్వామి ఆడుతూ పాడుతూ అందరి ప్రేమ చూరగుంటూ 14 సంవత్సరాలు గడిపాడు. దీనినే 'మాధుర్యలీల' ఇలా అంటారు. నందవ్రజంలో ఆయన పరమాత్మ గానే ప్రవర్తించాడు.



ఐశ్వర్య లీల: వజ్ర బృందావనాదుల నుండి మధురకు వచ్చిన తర్వాత కృష్ణుడు ప్రకటించిన లీలలను 'ఐశ్వర్యలీల' అంటారు. ఈశ్వరత్వాన్ని ప్రకటించిన లీల అది. కంసునిచే నిర్వహింపబడే ధనుర్యాగ సందర్శనానికి ముఖ్యఅతిథిగా ఆహ్వానించబడ్డాడు. అయితే కంసుడు కపటి స్వభావంతో కృష్ణుని అంతమొందించ తలపెట్టి కృష్ణునిపై మల్ల యోధులను పంపి చంప ప్రయత్నించాడు. కువలయ పీఠమనే మదగజాన్ని పంపి కృష్ణ బలరాములను చంపాలనుకున్నాడు. రెండు ప్రయత్నాలు విఫలమయ్యాయి. కృష్ణుడు కంసుని సంహరించాడు. దేవకీ వసుదేవుల పట్ల మాత, పితృభక్తిని ప్రకటించాడు. తాతగారైన ఉగ్రసేనుని రాజ్యాధిపతిని చేసి, తాను రాజ్య పరిపాలనలో తగిన పాత్రను వహిస్తూ వినయాన్ని చూపించాడు. తమ విద్యాభ్యాస నిమిత్తం సాందీపుని ఆశ్రమంలో చేరి ఆయన నుండి 64 విద్యలు అన్నదమ్ములిద్దరూ నేర్చుకుని గురుదక్షిణగా చనిపోయిన గురు పుత్రున్ని తిరిగి బ్రతికించారు. సుదాముడు అనబడే కుచేలుడు సాందీపుని గురుకులంలోనే చదువుకుంటూ కృష్ణునితో స్నేహం ఏర్పరచుకున్నాడు. అయితే అతను ఒక పేద బ్రాహ్మణుడు.

అష్టభార్యల ఇష్టసఖుడు: శ్రీకృష్ణునికి 8మంది రాణులు ఉన్నారు. రుక్మిణి, జాంబవతి, సత్యభామ, కాళింది, మిత్రవింద, నాగ్నజితి, భద్రమనవు, లక్షణ వీరంతా కృష్ణుడి కోసం తపించి భర్తగా పొందారు. సత్యభామ సహితుడై నరకాసురునిపై దండెత్తి శ్రీకృష్ణుడే స్వయంగా నరకాసురుని సంహరించాడు. 16 వేలమంది రాచకన్యలను శ్రీకృష్ణుడు బంధ విముక్తులను చేశాడు. తర్వాత వారంతా స్వామిని ఆశ్రయించారు. అందరికీ తానై ఆ అవతారమూర్తి నడిపిన 'గృహస్థలీల' చాలా బాగా నిర్వహించాడు.

సమస్త మానవులపై ప్రేమానురాగాలు: నిర్వికారుడైన పరమాత్ముని నిర్వికార లీలలు ఎన్నో ఎన్నెన్నో భాగవతంలో పొందపరచబడ్డాయి. ద్వారకా నగరంలో కొందరికీ తలవంచి, కొందరికి చేతులు జోడిరచి, కొందరికి పాదాలను తాకి ప్రణామం చేసేవాడు. కొందరిని చిరునవ్వుతో పలకరించేవాడు. ఇక పేదవారి విషయంలో వారిని పలకరించి కష్టాలు తెలుసుకొని వారి అవసరాలు తీర్చేవాడు. వికృత శరీరం, వికృత రూపంగల ఒక స్త్రీ కుబ్జను మధురానగరంలో చూసి కృష్ణుడు తన కరపల్లవల్లమ్ములతో ఆమెను అనుగ్రహించాడు. వెంటనే ఆమె తన వికృత రూపాన్ని విడిచి సౌందర్య లక్ష్మి విభవ సంపన్నురాలిగా మార్చబడిరది. ఆమె వక్రతను మార్చాడు.

ఆమె జన్మ సార్ధకమయింది. తన మిత్రుడైన కుచేలునికి ద్వారకలో అనంత సంపదలునిచ్చి తన దారిద్ర్యాన్ని అడగకుండానే రూపుమాపుతాడు. బేట్ ద్వారకలో కుచేలుడు ఆతిథ్యము పొందిన స్థలాన్ని భక్తులు తప్పనిసరిగా దర్శించుకుంటారు. ద్రౌపదిని కౌరవ సభలో ఆమె వస్త్రాలు తీసివేయబోయేవేళ కృష్ణ పరమాత్మను భక్తితో ధ్యానించి ఆయన కరుణతో మాన సంరక్షణ పొందింది. కొండంత ధనం ఉన్న కాసింత ప్రేమకే తాను బంధీ అవుతానని సత్యభామ గర్వభంగ ఇతివృత్తాంతం ద్వారా తెలియజేశాడు. కౌరవుల బాధలన్నీ తట్టుకొని క్షేమంగా దిగ్విజయంగా అరణ్య, అజ్ఞాతవాసాలను పాండవులు పూర్తి చేయడంలో కృష్ణుడు ప్రధాన పాత్ర వహించాడు. రాజనీతిజ్ఞుడు: ఏ అవతారానికి లేని ప్రత్యేకతను విశిష్టతను వాసుదేవుడు ప్రతి సన్నివేశంలో నిరూపించాడు. సంపూర్ణ అవతారతత్వం ప్రేమ తత్వానికి ప్రత్యక్ష నిదర్శనం. జగద్గురు విలక్షణ వైభవం అద్భుతం. కోరికతో, భయంతో, ద్వేషంతో, బంధంతో, భక్తితో, స్నేహంతో ఏదో రకంగా నన్ను పొందమని ప్రోత్సహించిన దేవుడాయన.

ఒక రాజనీతి శాస్త్రవేత్తగా నేతగా మన కృష్ణుని అనుశీలనం చేయవలసినది చాలా ఉంది. ఆయన అవతరించే సమయానికి లోకంలో పరిస్థితులు ఎంతో విషమంగా ఉన్నాయి. కంస, జరాసంధ, కాలయవన, నరక, శిశుపాల, దుర్యోధనాది స్వార్థపరుల చేతుల్లో అధికారం, సంపద ఖైదీలయ్యాయి. ఇట్టి పరిస్థితుల్లో తన రాజకీయ బుద్ధికుశలతతో, చాకచక్యంతో, ధైర్యంగా కేంద్ర వ్యవస్థను రూపొందించి సుపరిపాలన అందించిన దార్శనికుడు. శ్రీకృష్ణుడు ధర్మజుని నాయకునిగా తీర్చి దిద్దిన రాజ్యాంగ నిర్మాత.

గీత ఒక ధీర వచనం: ధర్మరాజు ధర్మబద్ధంగా జీవించేవాడు. ధర్మానురక్తి, ధర్మ అనుష్టానం ఆయన సహజ ప్రవృత్తి. అతని బాటలోనే అతని సహదరులు నలుగురు ధర్మ అనుష్టానపరులయ్యారు. కృష్ణుడు ఎంత ప్రయత్నించినా కౌరవులురాదీ ప్రతిపాదనలను తిరస్కరించారు. మహాభారత యుద్ధం అనివార్యం అయ్యింది. యుద్ధం ప్రారంభించిన రోజున అర్జునుడు తాత్కాలికంగా మమకారానికి లోనై కర్తవ్య విముఖడయ్యాడు. కౌరవ సైన్యంలో ఉన్న తన వారిని, గురువును, బంధువులను, హితులను చూసి వారందరినీ తాను చంపాల్సి వస్తుందేనన్న విషాదానికి లోనయ్యాడు. అటువంటి సమయంలో పరమాత్మ అతని ఉద్వేగాన్ని, ఆలోచనల్ని, ఆవేశాల్ని క్రమబద్ధీకరించే ప్రయత్నం చేశాడు.అర్జునుడికి తానేమిటో తెలుసుకునేటట్టు చేశాడు.కృష్ణుణ్ణి భోద ఫలించింది. అర్జునుడిలోని శక్తులన్నీ సర్వైన మార్గంలోకి మళ్ళాయి. ఉత్తేజం కలిగింది. అతని పరాక్రమం పతాక స్థాయికి చేరుకుంది.

కృష్ణుడిని గురువుగా, సఖునిగా, సర్వస్వంగా అర్జునుడు ఎంచుకున్నాడు. శ్రీకృష్ణుడు అర్జునుడి సారథ్యం కౌరవులను సంహరించాడు. కర్మను ఈశ్వరార్పణగా ఆచరించడమే సిద్ధికి హేతువు అనేది భగవద్గీత సారం. ఈ సూత్రంపై ఆధారపడి నడిస్తే శాంతి సుసాధ్యమే. అనంతకాలస్వరూపిణిగా తన విశ్వరూపాన్ని చూపించి అర్జునుని శోక మొహాలను తొలగించాడు.

గీతలో భగవానుడు పదేపదే ధర్మంగా కర్తవ్యాన్ని నిర్వహించు, భగవదర్పిత భావనతో వర్తించు అని ఉద్బోధించడాన్ని మనం గమనించాలి. ఆ ఉద్బోధన అర్జునునికే గాక సర్వమానవాళికీ వర్తిస్తుంది. ఇదే శ్రీ పరమాత్మ అందించిన పవిత్ర సందేశం.

గోకుల కృష్ణుడు తాను సర్వజ్ఞుడని తెలియ చేయ్యడంలోనూ, ఏమీ ఎరగని అమాయక బాలుని వలె ప్రవర్తించడంలోనూ, సమంగా తన సార్వ భౌమత్వాన్ని ప్రదర్శించాడు. ఆ లీల మానుష పురుషుడు చక్రవర్తులకే చక్రవర్తి కదా! ఆయనకు అసాధ్యమంటూ ఏమి ఉంటుంది? ఇలా తన రూప, గుణ, మాధుర్యాలతో అందర్నీ అలరిస్తూ, ఆకర్షించేవాడైన ఆ కన్నయ్యకు నా ప్రణామం.

ఓం నమో భగవతే వాసుదేవాయ

# ఈ విశ్వం యొక్క ఉనికికి కారణం ఏమిటి?



వేమూరి వేంకటేశ్వరరావు

ఈ విశ్వం యొక్క ఉనికికి కారణం ఏమిటి? ఈ విశ్వం ప్రాదుర్భావానికి కారణభూతులు ఎవ్వరు? ఈ విశ్వం పనిచేసే తీరు ఏమిటి? ఈ విశ్వనిర్మాణానికి వాడబడ్డ ఘటకద్రవ్యాలు ఏమిటి? మహావిస్ఫోటనం ఎందుకు జరిగింది? ఈ విస్ఫోటనంతోటే స్థలం, కాలం పుట్టేయని అంటారు కదా. విస్ఫోటనానికి "ముందు" స్థలమే లేకపోతే ఆ పేలిన పదార్థం (బ్రహ్మ పదార్థం?) ఎక్కడ ఉండేది? మహావిస్ఫోటనంలోనే కాలం పుట్టినప్పుడు "విస్ఫోటనానికి ముందు" అనే సమాసానికి అర్థం ఉందా?

మన ప్రశ్నలని భౌతిక శాస్త్రం విధించిన పరిధిలోనే అడుగుదాం. పదార్థం పరమాణు రేణువులతో తయారయింది అన్నారు కదా. కొన్ని పరమాణు రేణువుల అస్తిత్వానికి నిలకడ (అంటే స్థిరత్వం) ఉండి, కొన్నింటికి లేదు. ఎందుకని? మనిషి ఎంత పొడుగున్నాడో, ఎంత బరువున్నాడో కొలిచినంత మాత్రాన ఆ మనిషి తత్త్వం అర్థం అవుతుందా? అలాగే మనం చేసినదల్లా విశ్వంలోని అంశాలని కొన్నింటిని – దూరాలు, వేగాలు, కాలాలు, గరిమలు, ఆవేశాలు, మొదలైన భౌతిక రాశులని - కొలిచేం. అంతే కాని ఈ విశ్వం యొక్క తత్త్వాన్ని అర్థం చేసుకోలేదు. ఈ విశ్వం యొక్క అస్తిత్వానికి కారణం ఏమిటి? ఈ రకం ప్రశ్నలకి ఆధునిక భౌతిక శాస్త్రం ఆమోదకరమైన సమాధానాలు ఇవ్వలేకపోతోంది – ఇప్పటివరకు.



పైన అడిగిన ప్రశ్నలకి వేదాంత తత్త్వపు ధోరణిలో తప్ప శాస్త్రీయ ధోరణిలో సమాధానాలు చెప్పలేమని ఒప్పేసుకుందాం – మాటవరసకి. అంటే ఏమిటన్నమాట? కొన్ని రకాల ప్రశ్నలకి సమాధానాలు ఎక్కడ దొరుకుతాయో మనకే తెలియటం లేదు. మరికొన్ని రకాల ప్రశ్నలకి సమాధానాలు ఇంకా అధునాతనమైన అభిమతాలలో దొరకొచ్చనే ఆశ ఉంది. ప్రస్తుతానికి మొదటి రకం ప్రశ్నలకి సమాధానాలు మరొక

కోణం నుండి వెతుకుదాం.
ఈ మొదటి రకం ప్రశ్నలు భారతదేశంలో వర్ధిల్లిన సనాతన ధర్మ కర్తలు ఎప్పుడో వేదకాలంలోనే లేవదీశారు. ఋగ్వేదంలో (10.129) నాసదీయ సూక్తం అనే మంత్రం ఉంది. ఈ మంత్రం లోని భావం భాషకి అతీతం. యోగాభ్యాసం చేసిన మునులు అనుభవించి అవగాహన చేసుకున్న బ్రహ్మ సత్యాన్ని భాష విధించిన శృంఖలాలకి బద్ధులై చెప్పేరు. వారు చెప్పదలుచుకున్న మనోభావాన్ని భాషలో బంధించి చెప్పేసరికి సగం భావం నశించిపోయి ఉంటుంది. మిగిలినదానిని ఇంగ్లీషులోకో, తెలుగులోకో దింపి చెప్పటానికి ప్రయత్నిస్తే మరో వన్నె తరిగిపోతుంది. అయినా సరే నాసదీయ సూక్తంలోని ఏడు మంత్రాలలోని భావాన్ని, నాకు స్ఫురించిన విధంగా వ్యాఖ్యానించి తెలుగులో చెప్పటానికి ప్రయత్నం చేస్తాను.
ఈ సూక్తంలో, మంత్రానికి నాలుగు పాదాల చొప్పున, ఏడు మంత్రాలు ఉన్నాయి. ప్రతి మంత్రం లోను మొదటి పాదంలో చెప్పదలుచుకున్న ముఖ్యాంశం ఉంటుంది, మిగిలిన మూడు పాదాలలో కొంత వివరణ ఉంటుంది. మచ్చుకి రెండు మంత్రాలని ఈ దిగువ చూపుతాను.
కో అద్ధా వేద క ఇహ ప్ర వోచత్ కుత ఆజాతా కుత ఇయం విసృష్టిః। అర్వాగ్ దేవా అస్య విసర్జనేనాఽథా కో వేద యత ఆబభూవ॥ – (నాసదీయ సూక్తం, ఋగ్వేదం 10-129-06)
ఈ సృష్టి ఎక్కడినుండి వచ్చిందో, ఎలా సృష్టింపబడిందో ఎవరు చెప్పగలరు? దేవతలు కూడా సృష్టి మొదలయ్యాకే వచ్చిన వారు కదా, మరి ఈ సృష్టి ఎలా మొదలయ్యిందో ఆ ఎరుకగల వారెవ్వరు?
ఇయం విసృష్టిర్యత ఆబభూవ యది వా దధే యది వా న। యో అస్యాధ్యక్షః పరమే వ్యోమన్ త్సో అంగ వేద యది వా న వేద॥ – (నాసదీయ సూక్తం, ఋగ్వేదం 10-129-07)
ఈ సృష్టి ఆ కర్త సంకల్పమే, అవునో, కాదో? అత్యున్నత ఆకాశంలో ఉండి అధివీక్షించే దేవదేవునకు తెలుసునా? ఆయనకు కూడా తెలుసునో తెలియదో!
ఈ మంత్రాలని అర్థం చేసుకోటానికి ముందుగా "సత్" అనే మాటకి "అసత్" అనే మాటకి ఉన్న విస్తృతార్థం మనం గ్రహించాలి. "సత్" అంటే సత్వం లేదా అస్తిత్వం. దీనినే ఇంగ్లీషులో "బీయింగ్" (being) అనిన్నీ "ఎగ్జిస్‌టెన్స్" (existence) అనిన్నీ అనొచ్చు. తెలుగులో "ఉనికి" అని కాని, "ఉండటం" అని కాని చెప్పుకోవచ్చు. సత్ అంటే ఏమిటో చెప్పేను కనుక దీనికి వ్యతిరేకమైన లేక విరుద్ధమైన అర్థంతో "అసత్" అనే మాటని వాడదాం. అసత్ అంటే నాస్తిత్వం. సంస్కృతంలో "న" అంటే లేదు, కాదు అనే అర్థాలు ఉన్నాయి. కనుక మంత్రం మొదట్లోనే "న అసత్, న సత్" అనే ద్వంద్వ విరుద్ధ భావాలతో మొదలు అవుతుంది. అందుకనే దీనిని నాసదీయ సూక్తం అన్నారు. ఈ మంత్రానికి అర్థం ఏమిటో ప్రయత్నించి చూద్దాం.

1. సృష్ట్యాదిలో ఉనికి అనేది లేదు, ఉనికి లేకపోవటం అనేది లేదు ("నసదాసీన్నో సదాసీత్ తదానీం").
2. మృత్యువు లేదు, అమరత్వం లేదు, నామరూపాలు లేవు, రాత్రింబవళ్లు లేవు ("న మృత్యురాసీదమృతం న తర్హి న రాత్ర్యా")
3. అంతా చీకటితో ఆవృతమైన చిట్టచీకటి ("తమ ఆసీత్ తమసా గుళమగ్రే")
4. ఆ ఆదిలో కోరిక జనించింది . అది ఉనికికి, ఉనికి లేకపోవటానికి మధ్య ఉన్న తెరని ఛేదించింది ("కామస్తదగ్రే సమవర్తతాధి మనసోరేతః")
5. బీజం అలా నాటటంతో మహా శక్తులు నాలుగు దిశలలో ఉద్భవించేయి ("రేతోధ ఆసన్ మహిమాన ఆసన్ త్స్వధా")
6. ఈ సృష్టి ఎలా జరిగిందో ఎవరు చెప్పగలరు? ("కో అద్ధ వేద క ఇహ ప్రవోచత్| కుత అజాతా కుత ఇయాం విసృష్టిః")
7. ఆ సృష్టికర్తకే తెలియాలి. వాడికి కూడా తెలియదేమో ("యో అస్యాధ్యక్షః పరమే వ్యోమన్ | త్సో అఙ్గ వేద యది వా న వేద")

ఇప్పుడు ఈ ఏడు శ్లోకాలలో ఉన్న సారాంశాన్ని మన భాషలో చెప్పటానికి ప్రయత్నిస్తాను.

1. ఆదిలో మనకి అవగ-తమయే విశ్వం లేదు. (మం 1)
2. అంతరిక్షం లేదు. అం-తరిక్షానికి అవతల ఏమీ లేదు. కాని ఏదీ లేదనటానికి వీలు లేదు (అంటే, ఏదో ఉందనే భావం). (మం. 2, మం. 1)
3. ఆ ఉన్నదేదో అనం-తమైన సాంద్రత కలిగి ఉంది ("గహనం గభీరం", మం. 1).
4. "ఇది" తప్ప మరింకేమీ లేదు (మం. 2).
5. అవగాహనకి అందని ఆ "ఇది" మన అవగాహనకి అందని విధంగా దాగి ఉంది. (మం. 3)
6. ఆ "ఇది" ఏమైతేనే-మి, అది నామరూపాలు లేని శూన్యం (శూన్యం కూడ పూర్తిగా "శూన్యం" కాదని గుళిక శాస్త్రం చెబుతోంది కదా!) (మం. 3)
7. తాపం వల్ల దానికి అస్తి-త్వం సిద్ధించింది. (మం. 3)
8. ఇచ్ఛ వల్ల విశ్వం వి-కసించింది. (వికసించి, వ్యాప్తి చెందింది. ) (మం. 4)
9. దేవగణాలకి కూడ ఈ ప్రాదుర్భావం తరువాతే అస్తి-త్వం సిద్ధించింది. (మం. 6)
10. ఈ సృష్టికి కారణ-భూతమైన కారణం ఉందో లేదో తెలియదు. (మం. 7)
11. ఈ సృష్టికార్యం అనే ప్రహేళికకి పరిష్కా-రం ఉందో, లేదో! (మం. 6, 7)

ఈ సృష్టి ఆ కర్త సంకల్ప-మే, అవునో, కాదో? అత్యున్నత ఆకాశంలో ఉండి అధివీక్షిం-చే దేవదేవునకు తెలుసునా? ఆయనకు కూడా తెలుసునో తెలియదో! ఇన్ని విషయాలు చెప్పిన మహర్షి (ప్రజాపతి పర-మేష్ఠి), చివరికి మన ప్రశ్నల-కి సమాధానం చెప్పనే లేదు!

బ్రహ్మసత్యం (Ultimate Reality) యొక్క స్వభావ స్వ-రూపాలు భాషతో వర్ణించటం చాల కష్టం. "దాని"ది ద్వంద్వ స్వభావం. ఈ ద్వంద స్వభావా-న్ని పరిపరి విధాలుగా వర్ణించ-టానికి ప్రయత్నించేరు మనవా-ళ్లు. ఉదాహరణకి ఈ నాసదీయ సూక్తం యొక్క సారాంశమే గీత (2.16) లో ఇలా కనిపిస్తుంది:

నాసతో విద్యతే భావో, నభావో విద్యతే సతః
ఉ భ యో ర పి దృ ష్టో & ం - తః త్వనయోస్తత్త్వదర్శిభిః

ఆత్మ యొక్క నిజ స్వరూపం పై వివేచన జరుగుతున్న సంద-ర్భంలో చెప్పబడ్డ ఈ మంత్రానికి ఈ విధంగా భాష్యం చెప్పవచ్చు: "లేని వస్తువునకు ఉనికి లేదు. ఉన్న వస్తువు లేకుండా పోదు. ఆత్మ సత్ అనియు, అనాత్మ యగు దేహము అసత్ అనియు తత్త్వవేత్తలు మాత్రమే గ్రహింతు-రు." సదసద్ వస్తువులకు (అంటే సత్, అసత్ లకు) మధ్య గల తా-రతమ్యం తత్త్వజ్ఞులు మాత్రమే గుర్తించగలరు అని కృష్ణుడు బోధిస్తున్నాడు. సత్, అసత్; ఆత్మ, అనాత్మ; నిత్యం, అనిత్యం; సత్యం, అసత్యం అనే ద్వంద-భావాల మధ్య ఉండే అంతరం బహు సూక్ష్మం అగుటచే అవి జనసామాన్యమునకు పరోక్ష-ముగానే భాసించుచున్నవి తప్ప ప్రత్యక్షముగా కానరాకున్నవి.

నాసదీయ సూక్తం లోని చి-ట్టచివరి మంత్రం వంటిదే గీతలో మరొక శ్లోకం (2.29) ఉంది. అవలోకించండి:

ఆశ్చర్యవ త్పశ్యతి కశ్చి దేనం |
ఆశ్చర్యవత్ ద్వదది తథైవ చాన్యః
ఆశ్చర్యవ చ్చైవ మన్యః శృణోతి |
శ్రుత్వా ప్యేనం వేదన న చైవ కస్చి

ఆత్మ, దేహముల (సత్, అసత్) పరస్పర సంబంధమును గూర్చి వింతతో చూతురు, వింతగా పలుకుదురు, ఆశ్చర్యము-తో విందురు. దీనిని గూర్చి కన్నను, వినన్ను, పలికినను గూడ దీనిని నిజముగా నెరిగి

ఈ ప్రయత్నంలోని సారాన్ని పోత-నామాత్యుడు తెలుగులోకి ఎంత గంభీరంగా దింపేడో చూడండి:

కలడందురు దీనులయెడ
కలడందురు పరమ-
యోగి గణముల పాలన్
కలడందురన్ని దిశలను
కలడు కలండనె-
డువాడు కలడో లేడో

ఈ మాటలు గజేంద్రుడి నోటి వెంట వచ్చినా, ఈ భావం మహర్షి మెదడులో మెదలిన స్ఫూర్తి. ఇదే భావంతో నాసదీయసూక్తా-న్ని ప్రారంభిస్తాడు మహర్షి: "న అసత్ ఆసీత్ నొ సత్ ఆసీత్ తదామి". దీనిని ఇంగ్లీషులో "At first there was no being nor non-being" అన్నారు.

# అశ్వద్ధము - నీలకంఠము

ఆదూరి హైమవతి



అనగ అనగా ఒక అడవి. ఆ అడవిలో ఒకమారు అతివృష్టికి గాలులు తోడై పెద్ద పెద్ద చెట్లకొమ్మలన్నీ విరిగిపడ్డాయి.అడవి భీభత్సంగా తయారైంది.వర్షమూ ,గాలీ తగ్గేసరికి తూర్పు తెల్లారిపోయింది. కట్టుకున్న పక్షుల గూళ్ళు క్రింద పడిపోయాయి. పక్షులకు దిక్కు తోచక పిల్లా పాపలతో అరుస్తూ అడవంతా తిరగసాగాయి. అకలితో పాటుగా అవి తిరిగి గూళ్ళుకట్టుకోను బలమైన వృక్షాలను వెతుక్కుంటూ అడవంతా ఎగరసాగాయి.

వాటి అరుపులతో అడవి మారుమ్రోగిపోసాగింది. వాటి రాజైన గరుడ పక్షి వచ్చి అన్నింటికీ ధైర్యంచెపుతూ "ప్రకృతి భీభత్సాన్ని మనం ఏమీ చేయలేము. ధైర్యంగా అంతా ముందు ఏదో ఒకటి తిని కడుపులు నింపు కుని ప్రశాంతంగా మంచి వృక్షాలను వెతుక్కుని గూళ్ళుకట్టుకోండి. ఈ అడవంతామనదే. స్వేచ్ఛగా మీరు వెళ్ళి తాపీగా మంచి చెట్టును ఎంచుకుని గృహాలను నిర్మించుకోండి. అందాకా నేనుండే బలమైన చెట్టు కొమ్మలు గుబురుగా ఉన్నాయి. అక్కడ రాత్రికి విశ్రమించండి. ఏమీ భయం ఉండదు. అంతేకానీ ఊరికే అరుచుకుంటూ, భయపడుతూ ఉన్న శక్తిని వృధాచేసుకోకండి. ఆపదలు ఎప్పుడైన ఎవరికైనా రావచ్చు. ఆపద వచ్చినపుడే ఇంకా ధైర్యం కూడ గట్టుకుని బాగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. తెలిసిందికదా!మీకు ఏసాయం కావాలన్నా ఒకరి కొకరు సహకరించుకోండి. నావల్ల ఏదైనా సాయం కావాలంటే అడగండి" అని ఓదార్చి, ధైర్యవచనాలు చెప్పింది.

పక్షులన్నీ వారి నాయకుడు చెప్పినమాటలు విని రెక్కలు ఊపి ధన్యవాదాలు చెప్పి, అంతా తలో దిక్కుకూ ఎగిరిపోయాయి. ఒక పిచ్చుకల జంట మెల్లిగా ఒక రావి చెట్టుకొమ్మల క్రిందపడి ఉన్నరావి పండ్లను తిని ఆకలి తీర్చుకుని, మెల్లిగా రెక్కలు ఆడించుకుంటూ ఎగురుకుంటూ అడవంతా తిరగసాగాయి, తాము గూడు కట్టుకోను చెట్టును వెతుక్కుంటూ. అలా తిరిగి తిరిగి అలసిపోయి ఒక చెట్టు కొమ్మలమీద కూర్చున్నాయి. వాటికి కొన్ని మాటలు వినిపించాయి.

"పిచ్చుక మిత్రులారా! స్వాగతం సుస్వాగతం. ఎంతోకాలంగా మీకోసమే ఎదురుచూసున్నాను" అనేమాటలు విని, కాస్తంత కంగారుగా 'ఎవరు మాతో మాట్లాడేదీ! కనిపించండి' అన్నాయి ఒకేసారి రెండూనూ.

"ఓ మిత్రులారా! నేను కనిపిస్తూనే ఉన్నాను. మీరు కూర్చున్నది నాకొమ్మల మీదనే. నేను అశ్వద్ధవృక్షాన్ని" అన్నది రావిచెట్టు నీలకంఠం జంటతో.

ఆ పిచ్చుకలు ఆశ్చర్యంగా- "ఓ అశ్వద్ధమా! మేము పక్షులము, నీవు చెట్టువు. మేము నీకు మిత్రులం ఎలా అవుతాము. జాతి భేదం కదా మనది" అన్నాయి.

దానికి రావిచెట్టు "మిత్రులారా! మనమంతా భగవంతుని సృష్టిలో వారమే కదా! అందువల్ల మనమంతా మిత్రులమే. ఐనా మీకో విషయం చెప్పాలి. పూర్వం మీ తాతముత్తాతలు తిని వేసిన రెట్ట లోని విత్తుల వల్లే నా జన్మ వచ్చింది. దానికి కృతజ్ఞతగా మీ

జాతి వారికోసం నేను ఎదురు చూస్తున్నాను. ఇంతకాలానికి నా ఎదురుచూపులు ఫలించాయి. నేను చాలా బలమైన కొమ్మలు కలిగి ఉన్నాను. ఎలాంటి ఈదురు గాలులకూ నా కొమ్మలు విరగవు. ధైర్యంగా నా కొమ్మల్లో గూడు కట్టుకుని హాయిగా జీవించండి. నాకు తృప్తి కలుగుతుంది మిత్రులారా!" అనింది రావిచెట్టు.

"ఆహా నీ కొమ్మల్లా, నీ మనసూ చాలా విశాలమైనదే! మిత్రమా! మా కోరికా నీకోరికా ఒకటే కావడం మాకెంతో సంతోషంగా ఉంది సుమా! ధన్యవాదాలు. మా తాతల కాలం నాడు నీకు జరిగినమేలు ఇంతకాలం గుర్తుంచుకుని మాకు సహాయం చేస్తున్న నీ మనస్సు చాలా గొప్పది." అన్నాయి.

"చేసిన మేలు మరువడం క్రూరుల లక్షణం. ఎంతకాలమైనా మేలు మరువక తిరిగి సాయం చేస్తేనే అది ఉత్తముల లక్షణం అవుతుందని నాకూ మా అవ్వ చెప్పింది. మనం అలా ఉండకూడదు అని కూడా చెప్పింది. అన్నట్లు మీరుగూడు కట్టుకోను కావలసిన వస్తు సరంజామా లో నాచెట్టుకున్న ఆకులు వగైరాలను కూడా స్వేఛ్ఛగా వాడుకోవచ్చు" అంది రావిచెట్టు. వెంటనే ఆ పిచ్చుక జంట, గూడుకట్టుకోను కావలసిన గట్టి గడ్డి వగైరాలకోసం వెతికి తెచ్చుకుని, మెత్తని రావి చెట్టు జూలులాంటి ఎర్ర జుట్టును కూడా కలిపి మంచి గూడుకట్టుకుని, హాయిగా జీవించసాగాయి.

మనం పొందిన మేలు ఎన్నటికీ మరువక తిరిగి ఉపకారం చేయను సర్వదా ముందుకు రావాలి.

---

# ద్రౌపది

(17 వ పేజీ తరువాయి)

ఆ భగవంతుడొక్కడే నని సంపూర్ణమైన నమ్మకంతో కృష్ణుని వేడుకోవడం ... ఆమె ఆర్తిని ఆలించిన కృష్ణ స్వామి కృపా విశేషం తో ఆమె ఆపద గట్టెక్కడం .. పిదప ధృతరాష్ట్రుడు ద్రౌపదిని సాదరంగా పిలిచి వరాలివ్వడం... అదంతా వేరు....

కాని.. ఏ కాలం లో నైనా ఏ స్త్రీ కూడా కలలో కూడా అనుభవించని అసహ్యకరమైన అవమానాన్ని ఎదుర్కొన్నా .. ధైర్యం కోల్పోకుండా తన వాదనా పటిమతో ఉదాత్తమైన వ్యక్తిత్వంతో విపరీత పరిణామాలను సానుకూలం చేసుకునే ప్రయత్నం చేసిన ద్రౌపది పాత్ర సర్వకాలీన మై భాసిల్లుతుంది. ఆమె ఈ నాటి స్త్రీ వాదులకు కూడా అదర్శ ప్రాయమైనదనే నమ్ముతున్నాను.

మరొక చిన్న విషయం తో ఈ వ్యాసం ముగిస్తాను... వరమున పుట్టడంచే బాల్యానికి దూరమయింది. అసహజంగా అయిదుగురు భర్తలను పొందింది. రాజకుమార్తె గా సకల భోగాలను అనుభవించింది. అలాగే భిక్షాన్నాన్నీ తినగలిగింది.. ఒకవైపు ..ఆనాటి ప్రపంచం లో సామ్రాజ్ఞిగా అతున్నత గౌరవం పొందింది.. దానికి పొంగి పోలేదు.. దాసీ గా కౌరవ సభకు తలపట్టి ఈడ్చుకు రాబడింది.. అలాగే ఇలాంటి అవమానాలనూ ఎన్నో ఎదుర్కొంది... ఎన్నడూ క్రుంగి పోలేదు.. కష్ట నష్టా లెన్ని ఎదురైనా తానెన్నడూ ఆత్మహత్యకు పాల్పడలేదే. మరి ఈ నాటి యువత... ప్రేమించిన అమ్మాయి/అబ్బాయి దొరక లేదనో , పరీక్షలలో మార్కు లు తగ్గాయనో..అనుకున్నచోట సీటు రాలేదనో... మనకన్నా తక్కువ అర్హత కలిగిన వారికి ఉన్నత పదవులు దొరికాయనో... ఏవేవో పనికి మాలిన పిచ్చి ఆలోచనలతో అర్థాంతరంగా తమ బ్రతుకులు ముగించుకుంటున్నారు.. తల్లిదండ్రులకు .. ఆశ్రితులకు వేదన మిగిలిస్తున్నారు.. అవసరమా.. ఆలోచించండి...

# చలించని దళిత మహిళా హుంకృతి ముద్ర-శ్రీమతి-జూపాక సుభద్ర



బహుముఖ ప్రజ్ఞా పాటవాలు కలిగిన శ్రీమతి జూపాక సుభద్రగారు కవయిత్రిగా, కథకురాలుగా, కాలమిస్టుగా, వ్యాసకర్తగా, అనువాదకురాలుగా, పరిశోధకరాలుగా, నాయకురాలుగా,ఉత్తమవక్తగా, సంఘ సేవకురాలుగా, ప్రభుత్వ ఉన్నతాధి కారిణిగాతనదంటూ ఒక ముద్రతో దళితమహిళా మేధావిగా రాణిస్తున్నారు.

సుభద్రగారిని పరిచయం చేయడానికి ముందు మన దేశంలోని దళిత వ్యవస్థ గురించిరెండు మాటలు చెప్పాలి.

పేరుకు పెద్దిండ్లంటారు కానీ ఊరికటు చివరో ,అటు చివరో ఉంటాయి మతంగ వాసాలు. దాదాపుగా తెలుగు నేల మీది ఏ గ్రామంలో నైనా గ్రామ దేవతలుగా శక్తి స్వరూపిణి అనేకపేర్లతో పిలువబడుతున్నది. తెలంగాణ పల్లెపట్టులలో ఏ ఊళ్లో చూసినా తూర్పునపోచమ్మ గాను పడమటఎల్లమ్మగాను శక్తిస్వరూపిణి గ్రామదేవతల రూపంలో గ్రామీణులరక్షకై నిలచి ఉండటం ఆనవాయితీ. ఈ గ్రామదేవతలు మాతంకన్యకు మారురూపాలుగాప్రసిద్ధి.

"మాతంగ కన్యామ్ మనసా స్మరామి" శ్లోకాలు వల్లించిననోటనే ఆ పరివారానికి చెందినచిన్నా పెద్దా ఎవరు ఎదురు పడ్డా అంటకు అనే వైనం ఇప్పుడు కనిపించక పోవచ్చుగానికొన్ని దశాబ్దాల క్రితం ముమ్మరంగా ఉండేది. బ్రహ్మమెరిగిన వాడు బ్రాహ్మణుడనే కాలంలోబ్రహ్మర్షి గా

పేరు గాంచిన వసిష్టుడి అర్థాంగి అరుంధతి సాక్షాత్తూ అంత్యజగా అరుంధతీచరిత్ర చెబుతున్నది. ఆ అరుంధతికే హిందూ వివాహ సంప్రదాయంలో పెళ్లి అనంతరంఅరుంధతీ నక్షత్రదర్శనం చేయటం ఆచారం ఇప్పటికీ కొన సాగుతున్నది.

కుమార్తె. మతంగ మహర్షి వార-






సులుగా పురాణాలు చెప్పే పెద్ద-
మనుషులు వారిని పెద్దింటి వారిని
చేసి ఊరికి దూరంగా ఉంచటం
ఏ పరిణామాల వల్ల జరిగిందో
కాని ,ఆజాడ్యాన్ని తొలగించ-
డానికి సాక్షాత్తు శివుడు అద్వైత
మతస్థాపకుడైన శంకరాచార్యుని-
కళ్లు తెరిపించడానికి ఛండాలుని
రూపంలో వచ్చి శంకరాచా ర్యుని
నోట 'ఛండాలోస్తుసతుద్విజో-
స్తు గురురిత్యేషా మనీషా మమ
'అని మనీషా పంచకం చదివి-
స్తాడు. అర్జునుని గర్వభంగం
చేయడానికి అదే శివుడుకిరాతు-
ని రూపమెత్తుతాడు. వేలమంది-
ని కురుక్షేత్రంలో సంహరించిన
అర్జునుని కంటేగురుదక్షిణగా
వేలుకోసిచ్చిన గిరిజనుడు ఏక-
లవ్యుడినే గొప్పశిష్యుడిగా చెప్పు-
కుంటున్నాం . భారతంలో ధర్మ
వ్యాధుడు ఎంత గొప్ప జ్ఞానియో
చెప్పబడింది. స్వార్థ చింతన కల
కొందరుబల సంపన్నుల దుర్మా-
ర్గపు కృత్యాలే వీరిని పంచముల
స్థాయికి దింపాయి.

దేశస్వాతంత్ర్య సాధనతో
పాటు అస్పృశ్యతా నివారణ కోసం
గాంధీ ఎంతగానో కృషిచేయడ-
మే గాక హరిజన్ అనే పత్రికను
కూడా వెలువరించాడు.

ఒక దశలో ఆ ఆదర్శం వెలుగు-
చూసి మార్పు వస్తుందనుకునే
తరుణంలో బ్రిటీషు వాడి డివైడ్
అండ్ రూల్ ను ఒంటబట్టించు-
కున్న స్వార్థపూరితరాజకీయనా-
యకులు ఆరిపోతున్న కుంపటి
అగ్గి రాజేయడంతో , అంత వర-
కున్నసమన్వయధోరణి పోయి వి-
ద్వేషాగ్నులు ప్రబలి , పైకి అంటూ
ము ట్టూ ప్ర ద ర్శిం చ క పో యి నా
వివక్ష మాత్రం అలాగే మిగిలిపో-
యింది.

కాలానుగుణమైన మార్పులతో
ఆ వర్గంలో కొందరు విద్యావం-
తులై వారి స్థితిగతుల్ని లోకానికి
తమ రచనల ద్వారా తెలుపుతూ
తమ ఉనికిని చాటుకున్నారు.
అదిగో సరిగ్గా ఆ తరుణంలోనే
ఉద్భవించింది మాతంగి మహిళ
జూపాక సుభద్ర.

కవయిత్రిగా,కథారచ-
యిత్రిగా , వ్యాసరచయిత్రిగా ఏది
రాసినా తనదైన తెలంగాణాగొం-
తుకతో,అట్టడుగు వర్గాల అచ్చ-
మైన బతుకు పాలతో, తాను
చూచిన దళిత వర్గపు దైన్యాన్ని,
హైన్యాన్ని అక్షరాలకెత్తి, అణగ-
దొక్కాలనుకునేవారి అంతరం-
గాలమీదికి అస్త్రాలు సంధించి
అస్తిత్వాన్ని నిలబెట్టుకున్న ధీర
మహిళ శ్రీమతి జూపాక సుభద్ర.

అచ్చతెలుగు లో యయాతి
చరిత్ర రాసిన పొన్నగంటి తెలగన
గురించి చెప్పుకుం టాం.
తెలంగాణా భాషలో పెద్దింటి భాష
వేరే . సుభద్ర గారి కథలు పుస్తకా-
లు కవిత లు పుస్తకాలు ఏవి చూ-
చినాముందు మాటమొదలు-
కొని చివరి దాకా జూపాక స్వీయ
వర్గం స్వరంలో తెలంగాణా దళిత
భాష డప్పుకొట్టి చాటినట్టుగా
ఉంటుంది. రచనల నిండా ప్ర-
శ్నల దండోరా కనిపిస్తుం ది. ని-

ర్భీతితో నిజాయితీతో అడగటం ఆమెను అట్టడుగు వర్గాల అల్లి-రాణిని చేసింది.

'అయ్యయ్యో దమ్మక్కా ' అంటూ ఆమె రాసిన కవిత్వం గుండెలను కోస్తుంది.

ఆ ఛాయలకైనా ఎన్నడూ పోని వారికి, ఆ హృదయవిదారక దృ-శ్యాలను అక్షర చిత్రాలుగా చూ-పిస్తుంది. 'రాయక్క మాన్యం' కథలసంపుటి లోని కథలు మాదిగ వాడ మనుషుల ఆరాట పోరాటాలు అక్షరదృశ్యాలై కన్పి-స్తాయి.

భూపాలపల్లి జిల్లా లోని దామరాంచ పల్లెలో అక్టోబరు 30 న, 1964 లో జన్మిం చారుసు-భద్ర గారు.తండ్రి ప్రోత్సాహంతో చదువుకుని తెలుగులో ఎం.ఏ . చేసారు. తెలంగాణాసచివాల యంలో అదనపు కార్యదర్శిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసి ప్రస్తుతంగచ్చిబౌలి లో నివాస-ముంటు న్నారు. భావైక్యతకలిగిన కృపాకర్ మాదిగ వీరిజీవనసహ-చరులు.

పలు పత్రికలలో వీరు రాసిన కథలు, కవితలు, వ్యాసాలు ఆంధ్ర జ్యోతి,ప్రజాశక్తి, భూమిక, వార్త,-సాక్షి, నమస్తే తెలంగాణ, విపుల, నవ్య సోయి, మన తెలంగాణ,నవ తెలంగాణ , నడుస్తున్న చరిత్ర వంటి పలు దిన,వార, మాస పత్రికలలో ప్రచురించ బడ్డాయి. కథలనేపథ్యాలు మాదిగ మహి ళల జీవితాలకు సంబంధించిన-వే ఎక్కువ.

అవి తరువాత కవితా సంపుటులుగా, కథా, వ్యాస సంకలనాలు-గా పుస్తక రూపంలోప్రచురించబ-డ్డాయి.

అందులో అయ్యయ్యో దమ్మక్కా ... కవితా సంపుటికాగా ,రాయక్క మాన్యం, రిజర్వేషన్ప్-గీ, చరిత్రను చెరిగి పోస్తూ కథా సంపుటాలు. చంద్రశ్రీ యాదిలో సంచికసంపాదకు రాలిగా , కైతు-నకల దండెం(కవితా సంకలనం ), నల్లరేగడి సాల్లు(మాదిగ కలం కథల సంపుటి), కమ్యూనిజమా-కోస్తావాదమా ,ఉద్యోగక్రాంతి(మే-గజైన్) వంటి పుస్తకాలకు సహ సంపాదకురాలిగా ఉన్నారు.

అలాగే తమిళ రచయిత బామా గారి తమిళ నవల 'సందడి 'ని 'సంగతి 'గాఅనువదించారు సుభద్ర గారు.ఇవే గాక నల్లజెండా( కథల సంపుటి),తెలంగాణి (కవి-తాసంకలనం) 'మా అక్క ముక్కు పుల్ల గీన్నే పోయింది'( భూమిక పత్రికలో వచ్చిన ఆర్టికిల్సుంపు-టం) ముద్రణకు ఉన్నాయి.

కాకతీయ విశ్వవిద్యాల-యం లో ఎం.ఏ. చదువుతూ-నే గ్రూప్ -2 పరీక్షల్లో ఉత్తీర్ణు-రాలైనేరుగా సచివాలయంలో ఉద్యోగంలో చేరిన సుభద్రగారు అనతి కాలంలోనే APSA (AP Secretariate Association) ఎన్నికల్లో పాల్గొన్నారు. అంతవ-రకు మహిళా ఉద్యోగులుఎన్ని-కల్లో పోటీ చేసి గెలిచిన చరిత్ర లేదు. అది break చేసి Addl. secretary పోటీ చేసిగెలిచి తమ సత్తా చాటుకున్నారు.ఆ తరు వాత సెక్రటేరియట్ లోని మహిళా ఉద్యోగు లనుసమీకరించి ఏపీ సచివాలయ మహి ళా సంక్షేమ సంఘం, తరువాతి కాలంలో తె-లంగాణసచివాలయ మహిళా ఉద్యోగ సంఘాలను వ్యవస్థాపిం-చారు. అలాగే మట్టి పూలు SC St BC మైనారిటీ మహిళా సాహిత్య వేదిక, 'చేతన' సచివాలయ సా-రస్వత వేదికవ్యవస్థాపక సభ్యు-లుగా ఉండటం ఆమె చైతన్య స్ఫూర్తికి నిదర్శనం.

దళిత సాహిత్యం విద్యార్థులకు చేరాలనే ఉద్దేశంతో ఉస్మానియా విశ్వవిద్యాల యం, కాకతీయ విశ్వవిద్యాలయం,వేమన విశ్వ-విద్యాలయం తెలంగాణా విశ్వవి-ద్యాలయం ఇంకాఒకటి రెండు విశ్వవిద్యాలయాలు జూపాక సు-భద్రగారి రచనలను గతంలో పా-ఠ్యాంశాలుగాచేర్చటం జరిగింది.

వీరి అయ్యయ్యో దమ్మక్క కవిత్వం -పరిశీలనం అనే అంశం పై హైదరాబాదువిశ్వవిద్యాల-యంనుండి ఐనాల భార్గవి గారు ఎం. ఫిల్. చేయడం, అలాగే మైతా పుమల్లమ్మగారు శ్రీ వేంక-టేశ్వర విశ్వవిద్యా లయం నుండి సుభద్రగారి రాయక్క మాన్యం-కథలపై ఎం.ఫిల్.చేయడం,ఇ-దే విశ్వవిద్యాలయం నుండి వీరే జూపాకసుభద్ర గారిరచనలు పరి-శీలన అనే అంశం పై పిహెచ్.డి కై సిద్ధాంత గ్రంథం సమర్పించ-డం సుభద్రగారి రచనల వైశిష్ట్యా-న్ని చాటి చెప్పడానికి ఉదాహర ణలు అని

# శాస్త్రీ జీ



ఇంటిపేరు శ్రీవాస్తవ
ఇంట లేదు ' శ్రీ ' వాస్తవం
పిన్న వయసులోనే కన్న తండ్రి మరణం
పిన్న తండ్రి ఇంట్లో కన్నతల్లితో బ్రతుకు భారం

బాల్యంలో పేదరికానికి ఎదురీత
బడిచదువు కోసం గంగానది పై ఈత

పిన తండ్రి నీ డబ్బడగలేని ఆత్మాభిమాని
నిరుపేదగానే పుట్టి, జీవించి, మరణించిన దేశ ప్రధాని
రైలు ప్రమాదం జరిగిందని పదవి వీడిన రైల్వే మంత్రి

చైనా,పాకిస్థాన్ ల నిరోధించి న హోమ్ మంత్రి
వాణిజ్య, రవాణా ది శాఖలకు వన్నె తెచ్చిన వామన మంత్రి

దేశనాయకులంతా తీసుకుంటే మిమ్ము ఆదర్శం
మనదేశం అవుతుంది సుభిక్షం
అవినీతి రహిత సమాజం మన సొంతం



' జైజవాన్ జైకిసాన్ ' అంటూ నినదించిన మేధావి
శాంతి కోసమే తుది సంతకం చేసిన యోధుడు
భారత రత్న లాల్ బహుదూర్
భారతీయ జన హృదయ నేత! అందుకో మా జోహార్!

డి.రామ నాగేశ్వరరావు.

# గీతోద్భవ స్థలం కురుక్షేత్రం



ఆచార్య మత్స్యరాజ హరగోపాల్

'భగవద్గీత'లో పద్దెనిమిది (18) అధ్యాయాలు, 700 శ్లోకాలున్నాయి. సాంఖ్య, కర్మ, జ్ఞాన, భక్తి యోగాలు విశదంగా తెలుపబడ్డాయి.

ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో స్వజన సముదాయాన్ని చూచి అర్జునుడు తన విద్యుక్త క్షత్రియ ధర్మాన్ని మరచిపోతాడు. అర్జునుని కార్యోన్ముఖున్ని కావింపడానికి శ్రీకృష్ణ భగవానుడు ఉపదేశించినదే భగవద్గీత`

అందులో ప్రతి శ్లోకం మహత్వపూర్ణమైనదే. మనల్ని జాగృతులను చేస్తాయి. అయితే కొన్ని...

1. **దుఃఖేష్వద్విఘ్నమనాః సుఖేషు విగతస్పృహః।**

**వీతరాగ భయక్రోధః స్థితధీర్ముని ఉచ్యతే ॥**

(సాంఖ్య యోగః 2`8)

దుఃఖములకు కృంగిపోనివాడును, సుఖములకు పొంగిపోనివాడును ఆసక్తిని, భయ క్రోధములను వీడినవాడును అయినట్టి మననశీలుడు (ముని) స్థితప్రజ్ఞుడనబడును.

2. **కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన।**

**మా కర్మ ఫలహేతుర్భూర్మాతే సఙ్గో-స్త్వ కర్మణి ॥**

(సాంఖ్య యోగః 2`47)

(అర్జునా) నీకు కర్మను చేయుటయందే అధికారము కలదు. కర్మఫలముల నాశించుటయందే నాడును నీ కధికారము లేదు. కర్మఫలములకు నీవు కారణభూతుడవు కాకుము. మరియు కర్మలు మానుట యందును నీకాసక్తి కలుగుకుండుగాక!

3. **శ్రేయన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్**

**స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః**

(కర్మయోగం ` 3.35)

పర ధర్మాచరణము భయావహము.

4. **యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత।**

**అభ్యుద్ధాన మధర్మస్య తాదాత్మానం సృజామ్యహమ్ ॥**

(జ్ఞానయోగం 4`7)

ధర్మమునకు హాని కల్గినపుడు, అధర్మము పెచ్చు పెరిగినప్పుడు నన్ను నేను సాకారరూపంతో ఈ లోకంలో అవతరింతును (శ్రీకృష్ణభగవానుడు)

5. **పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్।**

**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥**
(జ్ఞానయోగము 4 `8)

సాధు, సజ్జనులను సంరక్షించుట కొరకును, దుర్మార్గు లను వినాశమొనర్చుట కొరకును ధర్మమును లెస్సగ స్థాపించుట కొరకును నేను ప్రతి యుగమునందును అవతరించు చుందును.

6. **పత్రం పుష్పం ఫలం తోయం యోమే భక్త్యా ప్రయచ్ఛతి ।**

**తదహం భక్త్యుపహృత, మశ్నామిప్రయతాత్మనః ॥**
(రాజవిద్యారాజ గృహ్యాయోగము 9`26)

ఎవరు నాకు భక్తితో ఆకునుగాని, పువ్వునుగాని, పండునుగాని, జలమును గాలి సమర్పించుచున్నాడో అట్టి పరిశుద్ధాంతంకరణుని యొక్క (లేక పరమార్థయత్న శీలుని యొక్క) భక్తి పూర్వకముగ నొసంగబడిన ఆ పత్ర పుష్పాదులను నేను (ప్రీతితో) ఆరగించుచున్నాను (అనుభవించుచున్నాను).

7. **తుల్యనిన్దాస్తుతిర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్**

**అనికేతః స్థిరమతిర్భక్తి మాన్మే ప్రియో నరః**
(భక్తియోగము 12`19)

శత్రువునందును, మిత్రునియందును, మానావమానములందును, శీతోష్ణ సుఖదుఃఖములందును సమముగా నుండువాడును, దేనియందును సంగము (ఆసక్తి, మనస్సంబంధము) లేనివాడును, నిందాస్తుతులందు సమముగా నుండు వాడును, మౌనముతో నుండువాడును (లేక మననశీలుడును), దేనిచేతనైనను (దొరికిన దానితో) తృప్తిని బొందువాడును, నిర్దిష్టమగు నివాసస్థానము లేనివాడును (లేక గృహాదులం దాసక్తి లేనివాడును),నిశ్చయమగు బుద్ధిగలవాడును, భక్తితో గూడియుండువాడునగు మనుజుడు నాకు ఇష్టుడు.

8. **అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్**

**స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే**
(శ్రద్ధాత్రయ విభాగము 17 ` 15)

ఇతరుల మనస్సును బాధింపగలిగింపనిదియు, సత్య మైనదియు, ప్రియమైనదియు, మేలు గలిగించునదియు నగు వాక్యమును, వేదాదుల యొక్క అధ్యయనమును అభ్యసించుట. (వేదము, ఉపనిషత్తులు, భగవద్గీత, భారత భాగవత రామాయణాదులు మున్నగు వానిని అధ్యయనం చేయుట, ప్రణవాది మంత్రములను జపించుట) వాచిక తపస్సని చెప్పబడుచున్నది.

9. **సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ**

**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః**
(మోక్షసన్న్యాస యోగము 18 ` 66)

సమస్త ధర్మములను విడిచి పెట్టి నన్నొక్కని మాత్రము శరణుబొందుము. నేను సమస్త పాపములనుండియు

నిన్ను విముక్తునిగ జేసెదను.

ముఖ్యంగా మానవుణ్ణి కార్యోన్ముఖుణ్ణి కావించడానికి, తనను తాను తెలుసుకొని, జీవితంతో అభివృద్ధి చెందడానికి, భగవద్గీత పఠనం ఉపయోగపడుతుంది. అందుకే నేడు దేశంలోని ప్రముఖమైన 'మేనేజ్‌మెంట్' కళాశాలల్లో ఇది పాఠ్యాంశంగా బోధింపబడుతుంది.

ఢిల్లీ ` చండీఘడ్ మార్గంలో ఢిల్లీ నుండి 200 కి.మీ. దూరంలో మూడు ` నాలుగు గంటల రోడ్డు మార్గంగా కురుక్షేత్రం చేరుకోవచ్చు. హైదరాబాద్ నుండి ఢిల్లీకి రైలు` రోడ్డు మార్గాలున్నాయి.

## ఆగస్టు నెల గళ్ళనుడికట్టు సమాధానాలు

| | | | | | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| క | యు | ణా | ప | యో | ని | ధీ | | క | నా | క | ష్టం | | కా | రం | | క | చ్చి | క |
| ద | | అ | | గ | | ర | ప | శిం | చు | | కా | క | ర | పు | వ్య | త్తి | | ము |
| శ్రీ | | | మం | క్షే | | స | | గ | | ఆ | | ర | ణం | తో | | పీ | ఠ | లా |
| ఫ | ల | కం | | మం | | మీ | | యు | గాం | తం | | ణ | | | కో | ట | | శు |
| ల | | చ | వి | | పు | రే | | ద్ధం | | క | | ము | ద్దు | లు | | | వా | న |
| న్యా | | రి | | ము | ట్టి | | పో | | బా | వా | జి | | సు | | | చ | చు | ర్స్యం |
| యుం | తో | | | క | ళ్లు | | క | ర | వ | దు | | చా | లు | | | ల్ల | | ము |
| | క | ర | క | ర | | ట్టు | చె | | | లు | గ | ప | | ట్టె | కో | | | |
| శి | తో | | ల | రా | చీ | | క్ష | ప | | | ది | క్రం | వి | పె | ద | | కుం | |
| | క్ష్య | | శ | శి | | | | తి | న్నం | తి | | ది | | | మ | న | దే | శం |
| పా | న | వ | ము | | గ | | | త్ర | | లు | లా | నీ | | | | | లు | |
| | తా | | | వ్య | తి | రే | క | తి | | పు | | యు | చి | | ది | | | తా |
| పీ | చు | ప | దా | ర్థం | | రా | | | | | పొ | | | శో | క | వ | రా | శి |
| ట | | దు | | | మూ | జు | వా | ణి | | ము | ళ్లు | | చు | ధిం | దో | | మ | |
| ము | | గు | డు | యు | తి | | చ | వే | వి | న | | లు | ట్లా | చి | | పం | చ | మి |
| డి | బ | రా | | బా | వి | | స్న | | | మ | | | లు | సా | | చ | క్ష | ర |
| | క | డు | పు | | యు | | తి | ము | న్న | ఉ | | క్ష | | ధిం | | లో | ని | ప |
| స | ము | మా | | చూ | పు | లు | | త్స్య | | ప | త్రి | ము | | చా | | హా | | కా |
| | లు | ట | కో | | లు | | | ము | ర | శ | | | తో | రి | చూ | లు | | య |

# అష్టమస్వరం

హైమవతీ సత్య



అన్నం పరబ్రహ్మ స్వరూపం అనేది నానుడి
పరమేశ్వరుని పదసవ్వడి నుండి
సప్త స్వరాలు జాలువారితే
"పరబ్రహ్మ" అంతరంగం నుండి జనించినదే
ఈ అష్టమస్వరం కాబోలు
ఆకలి ఆర్తనాదం చేసేవేళ
ప్రేవుల ఆలాపన ఎప్పుడైనా విన్నావా! లేదా?
అయితే
రెండ్రోజులు పస్తులుండి చూడు
ఆత్మారాముడి ఆత్మ ఘోష
గుహలో తిరుగాడే గాలి సవ్వడిలా
సప్త స్వరాలకు అతీతమైన ఓ "వింత" స్వరం
వినిపిస్తాది
శారఘాతానికి గురైన ఎలకోయిల కూత కన్నా
నిశబ్ద యుద్ధంలో అలసిన జవ్వని
గొంతు నుండి వెలువడే కూజితం కన్నా
మంద్రంగా అల్లిబిల్లిగా సాగే ఆ స్వరం
సంగీత స్రష్టలకు అర్థం కాని
ఓ కొత్త ఆలాపన
భావం లేని భాద నివురు కప్పిన నిప్పులా...
కనిపించని మంట ప్రేవులను మండిస్తుంటే
కాసిని మంచినీళ్ళతో ఆ మంటను
చల్లార్చుకునే అన్నార్తులకు తప్ప
అన్యులకు అర్థం కాని "అష్టమస్వరం" ..అది

---

# చందమామ అందినరోజు

శృంగవృక్షం గీతాలత



సంవత్సరాల శ్రమ ఆ కష్టం
యొక్క ఫలం ఎంత తీయనైనదో
అనుభవానికి వచ్చిన రోజు
ఎన్నో అనుమానాలు, అవమానాలు
ఎదనిండా నిర్వేదం ఆ రోజు
ప్రపంచమంతా ఆశక్తి గా
ఎదురు చూసిన క్షణం
ప్రపంచ దేశాల కు ధీటుగా
నా దేశం అనితెలిపిన రోజు
చంద్రయాన్ శాస్త్రవేత్తలందరిదీ
ఒకటే శ్వాస అందరూ సహశ్ర
చక్షువులతో ఎదురుచూసిన రోజు
చందమామ ను అందుకుంది అమ్మ
ఆనందపు కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడి
ఉక్కిరిబిక్కిరి అయ్యే క్షణం
అందరికీ మామ చందమామ అందినరోజు
మనదేశ బృందావని
నవ్వినరోజు
అందరి మనసులు భావోద్వేగాల
సమాహారం
ఇస్రో బృందానికి విజయహారం
**జై భారత్ జై జై భారత్**

# గళ్ళ నుడికట్టు



## ఆధారాలు - అడ్డం

1) పెళ్ళి పందిళ్ళల్లో ఎక్కువగా వినపడే పాట

12) ఒక రాయలసీమ జిల్లా

14) పిప్పి తీసేస్తే మిగిలేది, అట్నుంచి

15) సోలలాంటిదే

16) జూదంలో వేసేది

17) వన్నె పోయినది

19) చెడు ఉపాయము

20) సన్నము, అట్నుంచి

22) కొండలరావు, నటుడు

24) త్రికోణము, అక్షరాలు తడబడ్డాయి

26) తెలుడు కాదు

28) ఆర్‌టిసి వారి ఈ బస్సులో ప్రయాణం ఎంతో సుఖం

29) ఇంటర్వ్యూకి ఇది వచ్చిందా! అట్నుంచి

31) .... తలుపులు, కిటారు తలుపులు

32) గంప

33) అయితే ఒప్పు, లేకపోతే...

34) అరగదీయటానికి ఉపయోగించేది

36) ముంగిట అలంకరించే తెల్లటి పొడిని వీటిల్లో పోస్తాము.

39) ఎంచక్కా ఇందులో దిగి నీళ్ళు తెచ్చుకోవచ్చుట

43) .... ఇక చాలు, నీకై రాధవేచె వెయ్యేళ్ళు, అట్నుంచి

46) అనువు కానిచోట కొంచెం ఇలా ఉండాలి

47) .... న మనసై, బ్రతుకున, అక్షరాలు తడబడ్డాయి

49) మోసగాడు

50) సుందరం

51) ఒక దుంప, అక్షరాలు తడబడ్డాయి

52) ఎవరి పెళ్ళికి కోవెల తోట విడిదట?
53) స్త్రీ
54) పిల్లలు చేయాల్సింది
55) ఇవి కావు...
57) నీటిని వేడి చేస్తే వచ్చేది
60) సరిపడా
61) రామనామము, రామనామము..... రామనామము
63) గంగ.... సమానురాలు
64) పేరులోనే మస్కా ఉన్న దణ్ణం, అట్నుంచి
66) ముద్దు....
67).... గతః
68) మిథ్య
69) ఇది వార్చకండి!
70) ఒక సీరియలు
73) వీరుడు, అట్నుంచి
74) నీ అన్న నీ కన్నా.... అట్నుంచి
76) బూరెలగంపలో ఎప్పుడు పడతాం?
78) ఒక వృత్తి, అట్నుంచి
79) వని జరగాలంటే ఇవి సమర్పించుకోవాలా?
81) పూర్తి సమాచారము
83) నువ్వు
84) ... శోచితుమర్హసి
86) దీపావళి అనగానే వచ్చే పండుగ
87) సమానమైన
88) ... పడుద్ది!
89) ఇది కూడా ఒక వృత్తే
90) నాటు వైద్యులు ఈ మందు ఇస్తారట
91) ఒక పర్వతం... అట్నుంచి
92) ఓం.... నటరాజ నమో
93) తూచడానికి ఉపయోగించేది
95) పిండి వంటలు వండటానికి దీన్ని ఉపయోగిస్తారు.
97) గట్టిగా నొక్కు, అట్నుంచి
98) తెల్లటి పక్షులు
99) ఒక పెద్ద పుణ్యక్షేత్రం
100) మధ్య

## ఆధారాలు - నిలువు

1) తిరుచిరాపల్లి దగ్గర ఉన్న పుణ్యక్షేత్రం
2) మందు ఇందులో పోసి అమ్ముతారు
3) కర్ణుడు
4) ఒక ప్రముఖ రచయిత్రి
5) దీనితో చిలుకుతాము
6) కత్తి, అట్నుంచి
7) వీక్షించి
8) వివాదము
9) ఒక జీవ వృక్షం
10) వేలితో మర్దింపు
11) పొడికాదు, అట్నుంచి
13) నీరు ఎరిగేది
18) ఎక్కువ కోపం కలిగినవాడు
19) లేత ఆకు, అక్షరాలు తడబడ్డాయి
21) బండి
23) మార్లు
25) దానం, అట్నుంచి
27) అగ్నిలో
28) కంచి.... సేవ
30) విచారం, అక్షరాలు తడబడ్డాయి
34) ఇవి లేందే పోపు ఉందా?
35) ఊదే వాయిద్యం, అట్నుంచి
37) కప్పుకునేది, అట్నుంచి
38) ఇది తింటే పైత్యం తగ్గుతుందట, అట్నుంచి
39) ఎగుమతి కాదు
40) సహాయం
41) చివరలేనిది, అట్నుంచి
42) ...... పండు, వీరి పేరేమి
44) మనసుకి హాయి కలిగించే సంగీతం
45) రామదాసు అప్పుతీర్చిన పెద్దాయన
47) అడవి, అట్నుంచి
48) ఎంతటివాడికైనా వీడొకడుంటాడట, అట్నుంచి
51) కరిరాజ ముఖునికి లాలి ఎవరు పాడాలిట?
56) సన్నజాజిలాంటిదే
58) అల్లుడు కాదు
59) మనకు ఇది ఎక్కువని ఒక అపప్రథ
62) కొవ్వొత్తి చేయుటానికి కావలసినది
63) ఒక పవిత్ర గ్రంథం
65) ఈయన పోలికలు తప్పకుండా వస్తాయట, అట్నుంచి
66) పక్షి
59) ... పిల్లల్ని కనమని ఒకప్పుడు ఆశీర్వదించేవారు
71) ఇనప...., అట్నుంచి
72) వ్యాసుని తల్లి
74) నోట్లోకి ఇది పోకపోతే ఎలా? అట్నుంచి
75) "చివర"లో వాళ్ళే కావలసి వస్తుందట
77) టీ పార్టీ అంటే
80) కాలంకాని కాలంలో వచ్చే మామిడి కాయ
81) అనేక రకాలైన
82) అప్పులు ఇలా వసూలు చేయమని బ్యాంకు వాళ్ళకు ఆదేశాలట!
84) మూగవైతే ఏం, ఇది చాలట
85) ఇవి కొండంత తలపుతాయా?
87) సాధింపదగినది
88) దీని బలహీనతా? అని ప్రకటనలు, అట్నుంచి
89) పిచ్చి కోరిక
96) యుద్ధం లాంటిదే


నోబెల్ బహుమతి భౌతిక శాస్త్రం2023 విజేతలు


నోబెల్ బహుమతి (శాంతి )2023 విజేత

RNI No. TELTEL/2011/39497 OCTOBER 2023 POSTAL NO. HSE/1043/2017-19
Date of Publication:1st October Date of Posting:8th October

